Follow: @ANNTELUGU
21-01-2025
# మహా పత్రిక
ANN తెలుగు
మంగళవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 50 పేజీలు-08 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## డొనాల్డ్ ట్రంప్ రిటర్న్స్

**అంగరంగ వైభవంగా అమెరికా అధ్యక్షుడి ప్రమాణ స్వీకారం.. శ్వేతసౌధంలోకి మళ్లీ**

**దూకుడే నైజం.. ఏటికి ఎదురీదడమే ట్రంప్ తత్వం**

**మహా:** డొనాల్డ్ రిపబ్లికన్ పార్టీ నేత డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అమెరికా అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేశారు. అమెరికా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జాన్ రాబర్ట్స్ దేశాధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేయించారు. సోమవారం మధ్యాహ్నం(అమెరికా కాలమానం ప్రకారం) అతిరథ మహారథుల సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు. రాజధాని వాషింగ్టన్ డీసీలోని క్యాపిటల్ భవనంలో ప్రమాణ స్వీకారోత్సవ ఘట్టం అంగరంగ వైభవంగా జరిగింది. ప్రస్తుతం వాషింగ్టన్‌లో తీవ్రమైన చలి ఉంది.

మిగతా 2లో

**టాప్ న్యూస్**

### లోకేష్ పదవిపై ఎవరూ మాట్లాడొద్దు



- టిడిపి శ్రేణులకు హైకమాండ్ ఆదేశం
- లోకేష్‌ను డిసిఎం చేయండి పవన్‌ను సీఎం చేయండి అంటూ జనసైనికుల కౌంటర్లు
- కౌంటర్ల గోలతో.. నష్టనివారణ చర్యల్లో టిడిపి అధిష్టానం

02

### సుప్రీంకోర్టులో రాహుల్ గాంధీకి బిగ్ రిలీఫ్



- అమిత్ షాపై చేసిన వ్యాఖ్యలపై పరువునష్టం కేసు
- కేసు వేసిన బీజేపీ కార్యకర్త
- బాధిత వ్యక్తి మాత్రమే పరువునష్టం కేసు వేయగలరన్న రాహుల్ తరపు న్యాయవాది

02

### అక్కినేని అఖిల్ పెళ్లి డేట్ ఫిక్స్



- మార్చి24న మోగనున్న బాజాలు
- గ్రాండ్‌గా వేడుక

03



### ఆరోగ్యశ్రీ సేవలు యథాతథం

- మంత్రి దామోదర చొరవతో సేవల కొనసాగింపుకు సమ్మతి
- సమస్యలు పరిష్కరిస్తామని మంత్రి హామీ
- హర్షం వ్యక్తం చేసిన నెట్‌వర్క్ హాస్పిటల్స్ అసోసియేషన్ ప్రతినిధులు
- పేద ప్రజలను ఇబ్బంది పెట్టొద్దని మంత్రి సూచన


03



### రేషన్ కార్డులపై ప్రతిపక్షాలది దుష్ప్రచారం

- అర్హులైన ప్రతీ ఒక్కరికీ కార్డులిస్తాం
- ప్రతీ వ్యక్తికి 6కిలోల సన్నబియ్యం కూడా ఇస్తాం
- హరీష్ దుర్మార్గంగా మాట్లాడుతున్నారు
- రాష్ట్ర మంత్రి ఉత్తమ్

03



### నేను మారిపోయా.. ఇకపై గౌరవం పెంచే సినిమాలే చేస్తా

- కన్నీళ్లతో రాంగోపాల్ వర్మ ఆసక్తికర ట్వీట్లు
- సత్య నా కళ్ళు తెరిపించింది.. ఈ సినిమా చూసి ఏడ్చా
- ఓ సినిమాతీస్తే గానీ నమ్మలేం అంటున్న నెటిజన్లు

03

# అంతకు మించి

## రేవంత్ టార్గెట్ ఫిక్స్ .. దావోస్‌లో పక్కా ప్రణాళిక

### గత ఏడాది రూ.40 వేల కోట్ల పెట్టుబడులపై ఒప్పందాలు

రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పన.. ఆర్థిక ప్రగతి లక్ష్యంగా వ్యూహం



“ దావోస్‌లో అడుగుపెట్టిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పక్కా ప్లాన్‌తో పెట్టుబడుల సమీకరణలో దూసుకెళ్తున్నారు. గత ఏడాది దావోస్ పర్యటన సందర్భంగా రాష్ట్రానికి రూ.40 వేల కోట్ల పెట్టుబడులను ప్రభుత్వం సమీకరించింది. ఈసారి అంతకు మించి పెట్టుబడులను తేవడమే లక్ష్యంగా తమ పర్యటన కొనసాగుతుందని సీఎం రేవంత్ రెడ్డి ఇటీవల అధికారులతో సమీక్షలో వెల్లడించారు. అందుకనుగుణంగానే పకడ్బందీగా అడుగులు వేస్తున్నారు. ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు, రాష్ట్రంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి ప్రాజెక్టులతో అంతర్జాతీయ దిగ్గజ కంపెనీలు పెట్టుబడులకు ఆసక్తి ప్రదర్శిస్తాయని సీఎం భావిస్తున్నారు.

- మహా, హైదరాబాద్

06



### దావోస్‌లో తెలుగు సీఎంల రేస్

- సీఎం రేవంత్‌కు జ్యూరిక్‌లో ఘనస్వాగతం
- విమానాశ్రయంలో కలుసుకున్న రేవంత్, చంద్రబాబు

వివరాలు 6లో

# అద్దంకి పాలిటిక్స్

## ఒకేరోజు ఇద్దరు కీలకనేతలతో భేటీ

**రాంరెడ్డి దామోదరరెడ్డి, రాజగోపాల్ రెడ్డిల ఇంటికి దయాకర్**

**నల్లగొండ జిల్లాలో నయా రాజకీయం**



**హైదరాబాద్, మహా:** నల్లగొండ రాజకీయాలు మలుపులు తిరుగుతున్నాయి. కాంగ్రెస్ కీలక నేత అద్దంకి దయాకర్ సోమవారం నల్లగొండ కీలక నేతలు రాంరెడ్డి దామోదర్ రెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని కలవడం సంచలనంగా మారింది. దీంతో తుంగతుర్తి ఎమ్మెల్యే సామేలుకు చెక్ పెడుతూ.. తుంగతుర్తి పాలిటిక్స్ లోకి మళ్లీ ఎంట్రీ ఇచ్చేందుకే దయాకర్ వీరిని కలిశారా? అన్న చర్చ జరుగుతోంది. కొద్ది గంటల వ్యవధితోనే అద్దంకి దయాకర్ ఉమ్మడి నల్గొండ జిల్లాకు చెందిన బలమైన కాంగ్రెస్ నేత రాంరెడ్డి దామోదర్ రెడ్డితో పాటు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని కలవడం తెలంగాణ పాలిటిక్స్ లో హాట్ టాపిక్ గా మారింది. తుంగతుర్తి నియోజకవర్గంలో బలమైన అనుచరగణం కలిగిన దామోదర్ రెడ్డి, కోమటిరెడ్డి బ్రదర్స్ తో దయాకర్ కు గతంలో తీవ్రమైన విభేదాలు ఉన్నాయి.

మిగతా 2లో

## బీర్ బలులు.. డోన్ట్ వర్రీ




**కింగ్ ఈజ్ కమింగ్**

బీర్ల సరఫరా తక్షణమే పునరుద్ధరిస్తాం యూబీ సంస్థ ప్రకటన

వివరాలు 2లో

## కాళేశ్వరం అవకతవకలపై విచారణ

**తెలంగాణ ఆర్థిక శాఖ కార్యదర్శిగా పని చేసిన ఐఏఎస్ రామకృష్ణారావుకు నోటీసులు**

**మాజీ సీఎం కేసీఆర్, హరీష్, ఈటలకు పిలుపు వచ్చే అవకాశం**



**హైదరాబాద్, మహా:** కాళేశ్వరం ప్రాజెక్టు అవకతవకలపై ఏర్పాటైన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ విచారణ ముమ్మరంగా సాగుతోంది. ఇప్పటివరకు ఇంజినీర్లు, ఉన్నతాధికారులను ప్రశ్నించిన కమిషన్ తాజాగా తెలంగాణ ఆర్థిక శాఖ కార్యదర్శిగా పని చేసిన ఐఏఎస్ రామకృష్ణారావుకు నోటీసులు జారీ చేసింది. ఈ వారంలో మాజీ నీటాపారుదల శాఖా మంత్రి హరీష్ రావును కూడా విచారణకు పిలిచే అవకాశాలున్నాయి. వాటర్ రిసోర్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా పని చేసిన వి.ప్రకాశ్, పలు నిర్మాణ సంస్థలను బహిరంగ విచారణకు పిలువబోతున్నట్లు తెలుస్తోంది. ఓ వైపు విచారణ ప్రక్రియ కొనసాగిస్తూనే మరోవైపు విచారణకు సంబంధించిన రిపోర్ట్‌ను కమిషన్ తయారు చేస్తోంది.

మిగతా 2లో

## ఎయిర్ ట్యాక్సీలు రాబోతున్నాయ్


05

**ప్రయాణికులను గాలిలో తిప్పబోతున్న శూన్య**



- భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పోలో కనిపించిన నమూనా
- గంటకు 250 కిలోమీటర్ల వేగంతో ప్రయాణం
- ఒకేసారి ఆరుగురు ప్రయాణించే అవకాశం
- ఛార్జీలు కూడా తక్కువేనంటా.. హైదరాబాద్‌లోనూ ఎయిర్ ట్యాక్సీ సేవలు
- సూపర్ ఐడియా అంటూ ప్రశంసలు

## కుంభమేళాకు 8.5 కోట్ల భక్తులు




- ప్రయాగరాజ్‌లో ఎటు చూసినా జనసందోహం
- వివరాలు వెల్లడించిన ప్రభుత్వం
- క్యూ కడుతున్న విదేశీయులు
- ఎలాన్ మస్క్ సైతం వచ్చేందుకు ఇంట్రెస్ట్!

04

## సూపర్ గేమ్ ఛేంజర్‌గా రీజినల్ రింగ్ రోడ్


**ఐదు ప్యాకేజీల్లో ఉత్తర భాగం పనులు**

- తొలి దశలో నాలుగు వరుసలుగా నిర్మాణం
- ఉత్తర భాగం మొత్తం వ్యయం అంచనా రూ. 7,104.06 కోట్లు
- మారనున్న గ్రామాల రూపు రేఖలు
- 4 వేల ఎకరాల్లో నెట్ జీరో సిటీ నిర్మాణం
- అతి త్వరలోనే హైదరాబాద్ విశ్వనగరం




04

### కార్టూ'నిజం'




జనవరి 26 న రైతు భరోసా -మంత్రి పొన్నం


## సూపర్ గేమ్ ఛేంజర్‌గా
# రీజినల్ రింగ్ రోడ్

**ఐదు ప్యాకేజీల్లో ఉత్తర భాగం పనులు.. తొలి దశలో నాలుగు వరుసలుగా నిర్మాణం**

ఉత్తర భాగం మొత్తం వ్యయం అంచనా రూ. 7,104.06 కోట్లు.. మారనున్న గ్రామాల రూపు రేఖలు

4 వేల ఎకరాల్లో నెట్ జీరో సిటీ నిర్మాణం.. అతి త్వరలోనే హైదరాబాద్ విశ్వనగరం

**హైదరాబాద్, మహా :** తెలంగాణ సూపర్ గేమ్ ఛేంజర్‌గా అవుటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) అవతల నిర్మించనున్న రీజినల్ రింగు రోడ్ (ట్రిబుల్ ఆర్) నిలవనుంది. ఉత్తర, దక్షిణ రెండు భాగాలుగా సగం తెలంగాణను చుట్టేసేలా ఈ ప్రాజెక్టును రూపొందించారు. ఉత్తర భాగం పనులను ఐదు ప్యాకేజీల్లో చేపట్టాలని ఇటీవల కేంద్రం నిర్ణయించింది. ఈ మేరకు టెండర్లను సైతం ఆహ్వానించింది. గ్రీన్‌ఫీల్ రీజినల్ ఎక్స్‌ప్రెస్‌వేగా వ్యవహరించే ఈ ప్రాజెక్టును తొలి దశలో నాలుగు వరుసలుగా నిర్మించనుంది. సంగారెడ్డి జిల్లాలోని గిర్మాపూర్ నుంచి యాదాద్రి భువనగిరి జిల్లాలోని తంగడ్‌పల్లి వరకు మొత్తం 161 . 518 కిలో మీటర్ల మేర పనులు చేపట్టనున్నారు. ఉత్తర భాగం మొత్తం వ్యయం అంచనాను రూ. 7,104.06 కోట్లుగా కేంద్రం నిర్ణయించింది. ఉత్తర భాగంలో నిర్మించే రీజినల్ రింగు రోడ్డుకు 11 జాతీయ, రాష్ట్ర రహదారులు కనెక్ట్ కానున్నాయి. మహానగరం హైదరాబాద్‌తో పాటు నగర శివారులోకి కూడా రాకుండానే నేరుగా ఇతర రాష్ట్రాలకు ప్రయాణం చేయవచ్చు. వివిధ జిల్లా కేంద్రాలకు కూడా తక్కువ సమయంలోనే నేరుగా చేరుకోవచ్చు. అంతర్రాష్ట్ర వాహనాలకు దూరాభారం చాలా వరకు తగ్గనుంది. ఫలితంగా హైదరాబాద్ ప్రాంత పరిధిలో వీటి తాకిడి తగ్గే అవకాశాలున్నాయి. కనెక్టివిటీ పెరగడంతో ఎకనామిక్ కారిడార్‌గా ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని అధికారులు భావిస్తున్నారు. రీజినల్ రింగు రోడ్డుకు అనుసంధానమయ్యే జిల్లాల్లోనూ వ్యాపార రంగం మరింత వృద్ధి చెందనుందని అధికారులు చెబుతున్నారు.




### 13,972 ఎకరాల్లో నగరం నిర్మాణం

రంగారెడ్డి జిల్లా మీర్‌ఖాన్‌పేట్, ముచ్చర్ల, బేగరికంచె ప్రాంతాల్లో నాలుగో సిటీ నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. మొత్తం 13,972 ఎకరాల్లో ఈ నగరం నిర్మాణం కానుంది. ఇందులో వివిధ విభాగాలు, ఉప కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు భూములు కేటాయించనున్నారు. పర్యావరణాన్ని పరిరక్షించేందుకు నెట్ జీరో సిటీలో 33 శాతం పచ్చదనం ఉండేలా చర్యలు తీసుకోనున్నారు. వాణిజ్య పంటలు, చెట్లు, రహదారుల వెంట మొక్కల పెంపకం వంటివి ఉండనున్నాయి. పచ్చదనానికి ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా హైదరాబాద్ నగరంతో పోలిస్తే నాలుగో నగరంలో ఉష్ణోగ్రతలను 2-3 డిగ్రీలు తక్కువగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇళ్లు, పరిశ్రమల నుంచి వచ్చే వ్యర్థాల నిర్వహణకు ప్రత్యేక వ్యవస్థ రూపకల్పన జరుగుతోంది. వ్యర్థ జలాలను శుద్ధీకరించి పునర్వినియోగించేందుకు వీలుగా టెక్నాలజీని ఉపయోగించనున్నారు.

**మారనున్న గ్రామాల రూపు రేఖలు**

ఇంటర్‌ఛేంజ్‌ల వద్ద వివిధ ఆకృతుల్లో రోడ్లను నిర్మించనుండడంతో ఈ ప్రాంత రూపు రేఖలు మారనున్నాయి. ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగం సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల మీదుగా నిర్మించనున్నారు. భారత్‌మాల పరియోజన కార్యక్రమంలో భాగంగా ఎన్‌హెచ్ఏఐ ఈ రహదారిని నిర్మించనుంది. తెలంగాణ రోడ్లు, భవనాల శాఖకు సంబంధించిన ఎన్‌హెచ్ డివిజన్ సూచనలు, సలహాలు కూడా తీసుకుని ఈ ప్రాజెక్టును డిజైన్ చేశారు. ప్రధానంగా హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డుతో పాటు నేషనల్ హైవేలు, ఇతర జిల్లా కేంద్రాలకు వెళ్లే మార్గాలను దృష్టిలో పెట్టుకుని ఇంటర్‌ఛేంజ్‌లను ఏర్పాటు చేయనున్నారు. మొత్తం 11 ప్రాంతాల్లో ఇంటర్‌ఛేంజ్‌లు ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు. టోల్‌ప్లాజాలు, రెస్ట్‌రూంలు, సర్వీసు రోడ్లు, బస్‌బేలు, ట్రక్ బేలు నిర్మించనున్నారు. ప్రస్తుతం 4 లైన్‌ల హైవేగా నిర్మిస్తున్నా భవిష్యత్తులో ఆరు, ఎనిమిది వరుసలుగా పెంచుకునే ఛాన్స్ ఉందని చెబుతున్నారు. హైదరాబాద్ మహానగరంలో ఫోర్త్ సిటీ ఇప్పుడు హాట్ టాపిక్. రాష్ట్ర ప్రభుత్వ ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ నగరాన్ని తీర్చిదిద్దనుంది. రాష్ట్రంలోని తొలి నెట్ జీరో సిటీ ఇదే కానుండడం గమనార్హం. నాలుగో నగరానికి హైదరాబాద్ నుంచి సులభంగా చేరుకునేందుకు ఎయిర్‌పోర్ట్ నుంచి ఓఆర్ఆర్, ఓఆర్ఆర్ నుంచి ఫోర్త్ సిటీ ప్రాంతాలకు రహదారులు నిర్మిస్తున్నారు. ప్రతిపాదిత ప్రాంతాలైన బేగరికంచె, మీర్‌ఖాన్‌పేట్, ముచ్చెర్ల వరకు 330 అడుగుల వెడల్పుతో దారులు వేయనున్నారు. రావిర్యాల ఓఆర్ఆర్ నుంచి మీర్‌ఖాన్ పేట, ముచ్చర్ల, ఆమన్‌నగర్ మండలం ఆకుతోటపల్లె వద్ద ఆర్ఆర్ఆర్ కలుపుతో 40 కిలోమీటర్లు ఇందులో ఉంది. అలాగే రాజేంద్ర నగర్ నుంచి ఫోర్త్ సిటీ వరకు మెట్రో మార్గాన్ని పొడిగించాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ క్రమంలో ఆ మూడు గ్రామాలు బంగారమయం కానున్నాయి. అక్కడి భూములు, ఇళ్ల ధరలు భారీగా పెరగనున్నాయి.

**4 వేల ఎకరాల్లో నెట్ జీరో సిటీ నిర్మాణం**

రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలంలోని మీర్‌ఖాన్‌పేట, బేగరికంచె గ్రామాల్లోని 4 వేల ఎకరాల్లో నెట్ జీరో సిటీ నిర్మాణం జరగనుంది. వచ్చే 50 సంవత్సరాల వరకు మారనున్న పరిస్థితులకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. నాలుగు సంవత్సరాల కాలంలో దశల వారీగా ఈ సిటీ అందుబాటులోకి రానుంది. ఫ్యూచర్ సిటీ నిర్మాణంలో రాష్ట్ర ప్రభుత్వం ఎలక్ట్రానిక్స్, లైఫ్ సైన్సెస్ పరిశ్రమలకు తొలి ప్రాధాన్యం ఇవ్వనున్నారు. వాటి కోసం 9 వేల ఎకరాలు కేటాయించనున్నారు. లైఫ్ సైన్సెస్ జోన్‌లో ప్రాణాధార మందుల ఉత్పత్తి, పరిశోధన చేసే కంపెనీలకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. బేగరికంచె ప్రాంతంలో విశ్వ విద్యాలయ జోన్, వాణిజ్య నివాసాలు నిర్మాణం కోసం ఇప్పటికే భూముల ఎంపిక జరిగినట్లు సమాచారం. వినోద జోన్లు, నివాస ప్రాంతాలు, పరిశ్రమలు వంటి వాటి కోసం విద్యుత్తు సరఫరాపై ప్రణాళికలు వేస్తున్నారు.

## సుప్రీంకోర్టులో రాహుల్ గాంధీకి
# బిగ్ రిలీఫ్




**మహా:** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. లోక్ సభ ఎన్నికలకు ముందు కేంద్ర హోం మంత్రి అమిత్ షాపై చేసిన వ్యాఖ్యలకు సంబంధించి రాహుల్ పై పరువునష్టం కేసు నమోదయింది. ఈ కేసులో రాహుల్ పై క్రిమినల్ విచారణను నిలిపివేస్తున్నట్టు సుప్రీంకోర్టు తెలిపింది. రాహుల్ పై బీజేపీ కార్యకర్త నవీన్ ఝా వేసిన పరువునష్టం కేసును కొట్టివేసింది. రాహుల్ గాంధీ దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్ ను జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ధర్మాసనం ఈరోజు విచారించింది. రాహుల్ తరపున సీనియర్ న్యాయవాది, కాంగ్రెస్ నేత అభిషేక్ మను సింఘ్వి వాదనలు వినిపించారు. బాధిత వ్యక్తి మాత్రమే పరువునష్టం కేసు వేయగలరని... ప్రాక్సీ పార్టీ ద్వారా ఫిర్యాదు చేయలేమని చెప్పారు. ఇదే విషయాన్ని న్యాయస్థానాలు అనేక తీర్పుల ద్వారా వెల్లడించాయని తెలిపారు.

## లోకేష్ పదవిపై ఎవరూ
# మాట్లాడొద్దు

**అమరావతి, మహా:** ఏపీ మంత్రి నారా లోకేశ్ కు డిప్యూటీ సీఎం పదవి ఇవ్వాలంటూ డిమాండ్లు పెరుగుతున్ననేపథ్యంలో ఈ అంశంపై సీరియస్ అయిన టీడీపీ హైకమాండ్ కీలక ఆదేశాలు జారీ చేసింది. అత్యుత్సాహం వద్దని, ఈ అంశంపై ఎవరూ మాట్లాడొద్దని పార్టీ నేతలను ఆదేశించింది. మీడియా ముందు ఎవరూ బహిరంగ ప్రకటనలు చేయవద్దని స్పష్టం చేసింది. ఏ అంశమైనా కూటమి నేతలు కూర్చొని మాట్లాడుకుని, నిర్ణయం తీసుకుంటారని తెలిపింది. వ్యక్తిగత అభిప్రాయాలను బయటకు వెల్లడించవద్దని పేర్కొంది. నారా లోకేశ్ ను డిప్యూటీ సీఎం చేయాలనే డిమాండ్ల నేపథ్యంలో జనసేన వర్గీయుల నుంచి కౌంటర్ అటాక్ మొదలయింది. "లోకేశ్ ను డిప్యూటీ సీఎం చేయండి... అందులో తప్పేమీ లేదు... పవన్ కల్యాణ్ ను సీఎం చేయండి" అంటూ కామెంట్లు పెడుతున్నారు. ఈ నేపథ్యంలో టీడీపీ అధిష్ఠానం సీరియస్ అయింది. అత్యుత్సాహం వద్దంటూ టీడీపీ నేతలకు సూచించింది.

**ఇదీ ముచ్చట..**




## కాళేశ్వరం అవకతవకలపై
# విచారణ

(మొదటిపేజీ తరువాయి)

ఈ మేరకు ఇప్పటివరకు జరిగిన విచారణ రిపోర్ట్‌ను కమిషన్ చీఫ్ జస్టిస్ పీసీ ఘోష్ తయారు చేశారు. మార్చి నెలాఖరు వరకు కమిషన్ పూర్తిస్థాయి రిపోర్ట్ తయారు చేసే అవకాశం కనిపిస్తోంది. ఇందులో భాగంగా ఈ సెషన్‌లో క్రాస్ ఎగ్జామినేషన్ ప్రక్రియ ముగించే కసరత్తు చేస్తోంది. మాజీ ఈఎన్సీలను మరోసారి బహిరంగ విచారణ పిలిచే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

**రూల్స్ గీల్స్ జాంతానై..**

నిబంధనలు పాటించకుండా అడ్డగోలు చెల్లింపులు చేశారన్న ఫిర్యాదులు ఆర్థికశాఖపై ఉన్నాయి. ఫైనాన్స్ అండ్ పాలసీ, టెక్నికల్ అంశాలపై విచారణ పూర్తి చేసిన కమిషన్.. నిబంధనలు పాటించకుండా నిధులు విడుదల చేసినట్లు గుర్తించింది. రూల్స్ పాటించకుండా ప్రభుత్వం కాంట్రాక్టర్లను మార్చిందని, పనులు పూర్తి కాకుండానే బిల్లులు విడుదల చేసినట్లు కమిషన్ గుర్తించినట్లు తెలుస్తోంది. రూల్స్‌కు విరుద్ధంగా వ్యవహరించిన అధికారులపై సెక్షన్ 70 ప్రకారం చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ఇందులో భాగంగానే ఆర్థికశాఖ కార్యదర్శి ని విచారణకు పిలిచినట్లు తెలుస్తోంది.

**హరీష్, ఈటల లను విచారణకు పిలిచే ఛాన్స్**

ప్రాజెక్టు నిర్మాణంలో కీలక నిర్ణయాలు తీసుకున్నది ఎవరు? మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లలో బ్యారేజీలు కట్టాలని నిర్ణయించిందెవరు?బ్యారేజీల వైఫల్యానికి కారణాలు ఏంటి? రీ ఇంజనీరింగ్‌తో కాళేశ్వరం ప్రాజెక్టును తెరమీదికి తేవడానికి కారణమేంటి? వంటి వివరాలను కమిషన్ సేకరించే అవకాశాలున్నాయి. ఇప్పటికే జస్టిస్ చంద్రఘోష్ కమిషన్ పలు దఫాలుగా క్రాస్ ఎగ్జామినేషన్ చేయగా.. ఇదే చివరి విడత కావచ్చని తెలుస్తోంది. గతంలో నిర్వహించిన క్రాస్ ఎగ్జామినేషన్‌కు ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు హాజరు కాలేదు. దీంతో ఈసారి కమిషన్ నోటీసిచ్చింది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంతో సంబంధమున్న నీటిపారుదల శాఖ మాజీ ఈఎన్‌సీలు, ఇతర కీలక ఇంజనీర్లు, రిటైర్డ్ ఇంజనీర్లతో పాటు ఐఏఎస్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారులను కమిషన్ ఇప్పటికే ప్రశ్నించింది. మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, ఈటెల రాజేందర్ లను విచారణకు పిలిచే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అయితే వీరు హాజరవుతారా లేదా అన్నది చూడాలి.

# అద్దంకి పాలిటిక్స్

(మొదటిపేజీ తరువాయి)

ఈ నేపథ్యంలో వీరే దయాకర్ కు టికెట్ దక్కకుండా అడ్డుపడ్డారన్న ప్రచారం జోరుగా సాగింది. ఇప్పుడు దయాకర్ కు ఏ అవకాశం రాకుండా వీరే చక్రం తిప్పుతున్నారని కూడా కాంగ్రెస్ వర్గాల్లో ప్రచారం ఉంది. దీంతో వీరితో సయోధ్య కుదుర్చుకునేందుకు దయాకర్ ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే సోమవారం దామోదర్ రెడ్డితో పాటు రాజగోపాల్ రెడ్డిని కలిసినట్లు చర్చ సాగుతోంది. అయితే తుంగతుర్తిలో ఉన్న వీరి అనుచరగణం ప్రస్తుత ఎమ్మెల్యే కారణంగా ఉక్కపోతకు గురవుతుండడంతో అద్దంకిని మళ్ళీ ఆహ్వానిస్తున్నట్లు తెలుస్తోంది.

**తుంగతుర్తి ప్రకంపనలు**

ప్రస్తుతం తుంగతుర్తి ఎమ్మెల్యేగా ఉన్న మందుల సామేల్ కు, దామోదర్ రెడ్డి మధ్య విభేదాలు తారాస్థాయికి చేరాయి. తుంగతుర్తి నియోజకవర్గంతో తన కుమారుడు సర్వోత్తమ్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజదర్బార్ నిర్వహిస్తామని దామోదర్ రెడ్డి గతంలో సంచలన ప్రకటన చేశారు. సామేలుకు వ్యతిరేక వర్గం తలపెట్టిన మీటింగ్ ను పోలీసులు అడ్డుకున్నారు. కాంగ్రెస్ నేతలనే అరెస్ట్ చేసి ఇతర ప్రాంతాల పోలీస్ స్టేషన్లకు తరలించడం సంచలనంగా మారింది. కొన్ని రోజులుగా సామేలు ప్రవర్తన కోమటిరెడ్డి బ్రదర్స్ కు కూడా మింగుడు పడడం లేదన్న ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలో సామేలుకు చెక్ పెట్టేందుకు మళ్లీ దయాకర్ ను తెరపైకి తెచ్చారా? అన్న విశ్లేషణలు సైతం నల్లగొండ పాలిటిక్స్ లో వినిపిస్తున్నాయి. కేవలం సయోధ్య కోసమే దామోదర్ రెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని దయాకర్ కలిశారా? లేక తుంగతుర్తి పాలిటిక్స్ లో మళ్లీ ఎంట్రీ ఇచ్చి సిట్టింగ్ ఎమ్మెల్యే సామేలుకు ఝలక్ ఇస్తారా? అన్న అంశంపై మరికొన్ని రోజుల్లో క్లారిటీ వచ్చే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఎమ్మెల్యే టికెట్ , ఎంపీ టికెట్ రాకున్నా సహనంతో దయాకర్ గత ఏడాది కాలంగా పార్టీకి సహకరిస్తున్న తీరు క్యాడర్ మనసు గెలిచింది. దీంతో విభేదాలు పక్కనపెట్టి ఇపుడు దయాకర్ నాయకత్వాన్ని కోరుకుంటున్న నేతల సంఖ్య పెరుగుతున్నట్లు తెలుస్తోంది. తాజాగా అద్దంకి కార్యాచరణ నల్లగొండ పాలిటిక్స్ లోనే కాకుండా తెలంగాణలోనూ సంచలనంగా మారే అవకాశాలు కనబడుతున్నాయి.

## బీర్ బలులు..
# డోన్ట్ వర్రీ

**కింగ్ ఈజ్ కమింగ్**

**బీర్ల సరఫరా తక్షణమే పునరుద్ధరిస్తాం.. యూబీ సంస్థ ప్రకటన**




**హైదరాబాద్, మహా:** బీర్ బలులకు గుడ్ న్యూస్. కింగ్ ఫిషర్ కు బ్రేక్.. ఇక కేఎఫ్ తెలంగాణలో కనబడదన్న వార్తలన్నీ పటాపంచలైపోయాయి. ప్రభుత్వం దిగిరాలేదు. పరిస్థితిని కనిపెట్టి.. యుబి సంస్థే దిగివచ్చింది. నిర్మాణాత్మకంగా చర్చలు జరుపుతూ పరిష్కరించుకుంటాం కానీ ముందు బీర్ ఫ్యాన్స్ కు కొరత లేకుండా చూస్తామని చెప్పేసింది. నిలిచిపోయిన బీర్ల సరఫరాను పునరుద్ధిస్తున్నట్లు సంస్థలు వెల్లడించాయి. తెలంగాణలో బీర్ల ధరలు పెంచాలని, పాత బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ తో బీర్ల సరఫరాను నిలిపివేసిన విషయం తెలిసిందే. దీంతో రాష్ట్రంలో బీర్ల నిల్వలు భారీగా పడిపోయాయి. దీనిపై స్పందించిన యునైటెడ్ బ్రూవరీస్ సంస్థ బీర్ల సరఫరాను పునరుద్ధరిస్తున్నట్లు తెలిపింది. సెబీ రెగ్యులేషన్స్ కి అనుగుణంగా తెలంగాణ బీవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ కి బీర్ల సరఫరాను తక్షణమే అమలులోకి తీసుకొస్తున్నట్లు యూబీ సంస్థ ప్రకటించింది. తాము టీజీబీఎల్ తో నిర్మాణాత్మక చర్చలు జరుపుతున్నామని, బీర్ల ధరల పెంపు, పాత బకాయిల విడుదల వంటి సమస్యలను బేవరేజెస్ కార్పొరేషన్ సమాయనుకూలంగా స్పందిస్తామని హామీ ఇచ్చిందని తెలిపింది. ఈ చర్చలు మరింత కాలం కొనసాగుతాయని, వినియోగదారులు, కార్మికులు, వాటాదారుల ప్రయోజనాల దృష్ట్యా ప్రస్తుతానికి టీజీబీఎల్ కు బీర్ల సరఫరాను పునప్రారంభించాలని నిర్ణయించినట్లు యూబీ సంస్థ ప్రకటించింది. ప్రభుత్వం గట్టిగా ఉండడంతో.. ఇక తగ్గేదేలే కాదు తగ్గాల్సిందేనని బీర్ల కంపెనీ డిసైడయినట్లు తెలుస్తోంది.

**గవర్నర్ ప్రతిభా పురస్కారాలు 2024**

## 26న ప్రదానం చేయనున్న
# గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

**హైదరాబాద్, మహా :** గవర్నర్ ప్రతిభా పురస్కారాలు 2024 అవార్డులను తెలంగాణ రాష్ట్ర గవర్నర్ కార్యాలయం సోమవారం ప్రకటించింది. ఈ అవార్డులకు ఎంపికైన వారి జాబితాను విడుదల చేసింది. వివిధ రంగాల్లో సేవలందించిన వ్యక్తులు, సంస్థలకు రాజ్‌భవన్ ఈ అవార్డులను ప్రకటించింది. జనవరి 26న తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఈ అవార్డులను అందించనున్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా నాలుగు రంగాలకు చెందిన వారికి ప్రతి సంవత్సరం ఈ పురస్కారాలు ఇవ్వాలని తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ నిర్ణయించారు. పర్యావరణ పరిరక్షణ, దివ్యాంగుల సంక్షేమం, క్రీడలు, సాంస్కృతిక విభాగాల్లో గత ఐదేళ్లుగా ఉత్తమ సేవలు అందిస్తున్నవారికి గవర్నర్ ప్రతిభా పురస్కారాలు ఇవ్వనున్నట్లు గవర్నర్ ముఖ్య కార్యదర్శిగా బుర్రా వెంకటేశం వెల్లడించారు. సంస్థలు, వ్యక్తులకు వేర్వేరు కేటగిరీల్లో ఈ అవార్డులు ఉంటాయని, అవార్డు కింద కింద రూ. 2 లక్షలు, జ్ఞాపిక ఇవ్వనున్నట్లు ఆయన చెప్పారు.




**అవార్డులకు ఎంపికైన వారి వివరాలు**

పారా ఒలింపిక్ విజేత జీవాంజి దీప్తి
దుశర్ల సత్యనారాయణ
అరికపూడి రఘు
ప్రొఫెసర్ ఎం పాండురంగారావు, పీబీ కృష్ణభారతికి సంయుక్తంగా
ధృవాంశు ఆర్గనైజేషన్
ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి
ఆదిత్య మెహతా ఫౌండేషన్ సంస్కృతి ఫౌండేషన్

## అటు ట్రంప్ ప్రమాణ స్వీకారం

**ఇటు దుండగుల కాల్పులు**

**కాల్పుల్లో హైదరాబాద్ యువకుడు మృతి**



**మహా :** అమెరికా అధ్యక్షుడిగా డోనాల్డ్ ట్రంప్ ప్రమాణ స్వీకారం చేయబోతున్న వేళ ఊహించని షాకింగ్ పరిణామం జరిగింది. ప్రమాణ స్వీకారం చేస్తున్న వేళ భారీ బందోబస్తు కొనసాగుతున్న వాషింగ్టన్ లో కాల్పులు చోటు చేసుకున్నాయి. ఈ కాల్పుల్లో తెలంగాణ విద్యార్థి మృతి చెందాడు. నెల రోజుల క్రితం తెలంగాణకు చెందిన ఒక విద్యార్థి దుండగుల కాల్పులలో మృతి చెందగా తాజాగా మరో హైదరాబాదీ యువకుడు దుండగుల కాల్పులలో మృతి చెందడంతో ఆ యువకుడి కుటుంబంలో ఊహించని విషాదం చోటుచేసుకుంది. హైదరాబాద్ చైతన్యపురి పరిధిలో ఆర్కే పురం డివిజన్ గ్రీన్ హిల్స్ కాలనీ రోడ్డు నెంబర్ 2 లో నివసిస్తున్న కొయ్యడ చంద్రమౌళి కుమారుడు రవితేజ 2022 మార్చి నెలలో యూఎస్ వెళ్ళాడు. అక్కడ తన మాస్టర్స్ డిగ్రీని పూర్తి చేసి ప్రస్తుతం ఉద్యోగం కోసం అన్వేషణలో ఉన్నాడు. కొడుకు ఉద్యోగం వచ్చి స్థిర పడతాడని తల్లిదండ్రులు భావించిన వేళ ఊహించని ఘటనలో రవి తేజ మృతి చెందటం ఆ తల్లిదండ్రులు జీర్ణించుకోలేక పోతున్నారు. దుండగులు జరిపిన కాల్పులలో రవితేజ మృతి చెందాడు. ఇక ఈ సమాచారంతో రవితేజ కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తోంది. గత నవంబర్ లో ఖమ్మం వాసి మృతి ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లి చదువు పూర్తిచేసే ఉద్యోగాన్వేషణలో ఉన్న రవితేజ మృతి చెందడం తో అక్కడ ఉన్న తెలుగు వారు తీవ్రభయాందోళనలో ఉన్నారు. ఇదిలా ఉంటే గత ఏడాది నవంబర్ నెలలో చోటు చేసుకున్న కాల్పుల ఘటనలో ఖమ్మం జిల్లా వాసి మృతి చెందాడు. అమెరికాలోని చికాగోలో దుండగుల కాల్పులలో సాయితేజ అనే విద్యార్థి ప్రాణాలు కోల్పోయాడు.

# అక్కినేని అఖిల్ పెళ్లి డేట్ ఫిక్స్

**మహా:** అక్కినేని హీరో అఖిల్ పెళ్ళి డేట్ ఫిక్సయింది. ఇప్పటివరకు ది మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్ గా ఉన్న అతను ఇక వైవాహిక బంధంలోకి అడుగుపెట్టనున్నాడు. తాజాగా జైనాబ్ రవడ్జీ అనే అమ్మాయి తో అఖిల్ ఎంగేజ్ మెంట్ జరిగింది. ఇప్పుడు వీరి వివాహం గ్రాండ్ గా జరగనుంది. మార్చి24న అఖిల్ వివాహం జరగబోతుందని తెలుస్తుంది. ఇప్పటికే ఇరు కుటుంబాలు దీని గురించి చర్చలకు కూడా జరుపుకొని తేదీని ఫిక్స్ చేశారని టాక్. అఖిల్‌జైనాబ్ వివాహం ఘనంగా చేసేందుకు నాగార్జున ప్లాన్ చేస్తున్నారని తెలుస్తుంది. ఈ వివాహ వేడుకకు ఎంతో మంది ప్రముఖులు రానున్నారని అంటున్నారు. సినీ సెలబ్రెటీలు , రాజకీయ ప్రముఖులతో పాటు క్రికెటర్స్ ను కూడా వీరి వివాహానికి ఆహ్వానించనున్నారని తెలుస్తుంది.



## కాబోయే సీఎం లోకేశ్ అంటూ..
## జ్యూరిచ్‌లో మంత్రి భరత్ ప్రసంగం

**మండిపడిన చంద్రబాబు.. అసందర్భ ప్రసంగాలు చేయకండంటూ ఫైర్**



**మహా:** స్విట్జర్లాండ్ లోని జ్యూరిచ్ లో తెలుగు కమ్యూనిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో ఏపీ పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ ప్రసంగం సీఎం చంద్రబాబును ఆగ్రహానికి గురిచేసింది. భవిష్యత్తులో ఏపీ ముఖ్యమంత్రి నారా లోకేశ్ గారే అంటూ భరత్ ప్రసంగించారు. ఎవరు కాదన్నా ఇది జరిగి తీరుతుందనే కోణంలో ఆయన వ్యాఖ్యానించారు. ఇదే వేదికపై ఉన్న సీఎం చంద్రబాబు... మంత్రి భరత్ పై మండిపడ్డారు. వ్యక్తిగత అభిప్రాయాలు ఇలాంటి వేదికలపై మాట్లాడొద్దని హెచ్చరించారు. ఎక్కడికి వచ్చి ఏం మాట్లాడుతున్నారు మీరు... మనం వచ్చిన పనేమిటి... మీరు మాట్లాడుతున్నదేమిటి... అసందర్భ ప్రసంగాలు చేయొద్దని మందలించారు. భవిష్యత్తులో ఇలాంటి వ్యాఖ్యలు మరోసారి చేయొద్దని స్పష్టం చేశారు. కాగా, ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్, కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు కూడా ఉన్నారు.

## మినిస్టర్స్ డైరీ

# అధికారులు రైతుల పక్షాన ఉండాలి

### జవాబుదారీతనంతో పనిచేయాలి

### లబ్ధిదారులకు రైతుభరోసా అందించాలి-మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**హైదరాబాద్, మహా:** మార్కెటింగ్ అధికారులతో వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మాత్యులు తుమ్మల నాగేశ్వరరావు సమీక్ష సమావేశమయ్యారు. మార్కెటింగ్ శాఖ పూర్తి కార్యకలపాలపై సమీక్షించారు. పత్తి కొనుగోలు, మార్కెటింగ్ ఫీజు, స్టోరేజీ కెపాసిటీ తదితర అంశాలపై మంత్రి ఆరా తీశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలలో మార్కెట్లకి సంబంధించి వార్తలు వచ్చినప్పుడు స్పందించాల్సిన బాధ్యత ఉందని, ఒకవేళ పరిష్కారం వారి స్థాయిలో లేనట్లయితే ప్రభుత్వ దృష్టికి తేవాలని సూచించారు. కింది స్థాయి నుండి పైస్థాయి వరకు ఉద్యోగులందరూ సమన్వయంతో పనిచేసినప్పుడే రైతులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. మార్కెటింగ్ ఇంజనీరింగ్ విభాగంలో చేపట్టిన పనుల పురోగతి అంత ఆశాజనకంగా లేవని, ప్రతి నెలకోసారి పనుల పురోగతిని సమీక్షించి, నివేదిక ఇవ్వాల్సిందిగా అధికారులను ఆదేశించారు. అదేవిధంగా ప్రాముఖ్యతను బట్టి పనులను పూర్తిచేయాలన్నారు. ఇప్పటిదాకా 25 లక్షల మెట్రిక్ టన్నుల పత్తి సేకరణ లక్ష్యంగా పెట్టుకొని, 18 లక్షల మెట్రిక్ టన్నుల పత్తిని మద్ధతు ధరకు సేకరించామని అధికారులు తెలియజేయగా, వెంటనే మంత్రి స్పందిస్తూ, ఇంకా రైతుల వద్ద మిగిలి ఉన్న పత్తిని కూడా రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సేకరించాలన్నారు. ప్రతి మార్కెటింగ్ సెక్రటరీ ఒక పత్తి సేకరణే కాకుండా ప్రతిరోజూ మార్కెట్లకు వచ్చే వివిధ రకాల పంట ఉత్పత్తుల అమ్మకాలలో రైతుల పక్షాన ఉండి, వారికి గిట్టుబాటు ధరలు కల్పించే విషయంలో చొరవ చూపాలని ఆదేశించారు. ఫిర్యాదుల విభాగానికి అందే సమస్యలకు వెంటనే పరిష్కారం చూపించే బాధ్యత తీసుకోవాల్సిందిగా ఆదేశించారు. అదే విధంగా ఫిర్యాదులలో ఎవరిదైన తప్పని తేలితే తగుచర్యలు చేపట్టడానికి అవసరమైతే కమిషన్ ఏజెంట్స్, జిన్నింగ్ మిల్లుల లైసెన్సులు రద్దు చేయడానికైనా, ఒకవేళ ఉద్యోగస్తుల ప్రమేయం ఉన్నట్టు తేలితే వారిమీద క్రమశిక్షణా చర్యలు తీసుకోవడానికి కూడా ప్రభుత్వం వెనుకాడదని స్పష్టం చేశారు. జిల్లా మార్కెటింగ్ అధికారులు తమ జిల్లా పరిధిలోని మార్కెట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, వచ్చే సమీక్ష సమావేశానికి రాష్ట్ర స్థాయి అధికారులు పూర్తి నివేదికలతో సిద్ధంగా ఉండాలని, ప్రభుత్వపరంగా ఉద్యోగస్తులకు కావాల్సిన సహాయ సహకారాలు అందించే బాధ్యత తమదన్నారు. రైతుల హక్కుల పరిరక్షించే బాధ్యత మార్కెటింగ్ శాఖ అధికారుల మీద ఉందని, ప్రభుత్వ ప్రాధాన్యతలను గుర్తించి పనిచేయాలని హితవు పలికారు.

**రైతుభరోసా అందే విధంగా సర్వే**

అదేవిధంగా రైతుభరోసా పథకం అమలు, సర్వే జరుగుతున్న తీరు గురించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ , ఏ ఒక్క అర్హత గల రైతు నష్టపోకుండా రైతుభరోసా అందేవిధంగా సర్వే జరగాలని, ప్రభుత్వ ఆదేశాల ప్రకారం సాగుకు అనువుగాని భూములను గుర్తించి, గ్రామసభలలో వాటి వివరాలు అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. అదే సమయంలో కొత్తగా చేరిన పట్టాదారుల బ్యాంకు వివరాలను ఏఈఓలు నమోదు చేయాల్సిన బాధ్యత తీసుకోవాలన్నారు. మండల వ్యవసాయాధికారులు వాటిని ధృవీకరించి అప్‌లోడ్ చేయాల్సిందిగా ఆదేశించారు.

# ఆరోగ్యశ్రీ సేవలు యథాతథం

### మంత్రి దామోదర చొరవతో సేవల కొనసాగింపుకు సమ్మతి

### సమస్యలు పరిష్కరిస్తామని మంత్రి హామీ

### హర్షం వ్యక్తం చేసిన నెట్‌వర్క్ హాస్పిటల్స్ అసోసియేషన్ ప్రతినిధులు

### పేద ప్రజలను ఇబ్బంది పెట్టొద్దని మంత్రి సూచన

### ఆరోగ్యశ్రీకి ఏడాదిలోనే రూ.1137 కోట్లు చెల్లించాం

### ఇటీవలే ప్యాకేజీల రేట్లను సవరించాం.. సమస్యలేవైనా ఉంటే పరిష్కరిస్తాం

### మంత్రి చర్చలపై.. ఆస్పత్రి యాజమాన్యాల సానుకూలం




**తెలంగాణ బ్యూరో, మహా -:**
రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ సేవలు యథావిధిగా కొనసాగనున్నాయి. దశాబ్ద కాలంగా పెండింగ్‌లో ఉన్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఇటీవల పలు హాస్పిటళ్లు ఆరోగ్యశ్రీ సేవలను నిలిపివేయగా, హాస్పిటల్స్ యాజమాన్యాలతో ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సోమవారం సమావేశమయ్యారు. ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ఆఫీసులో జరిగిన ఈ సమావేశంలో హెల్త్ సెక్రటరీ క్రిస్టినా, ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ హాస్పిటల్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ రాకేశ్, జనరల్ సెక్రటరీ హరిప్రకాశ్, డాక్టర్ సౌజన్య, హరీశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. దశాబ్దకాలంగా పెండింగ్‌లో ఉన్న తమ సమస్యలను పరిష్కరించాలని అసోసియేషన్ ప్రతినిధులు మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఎంప్యానల్‌మెంట్ ఎంవోయూను సవరించాలని, ఆరోగ్యశ్రీ ప్యాకేజీల రేట్లను రివైజ్ చేయాలని కోరారు. ఆరోగ్యశ్రీ బకాయిలను చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ 'పేద ప్రజల విద్య, వైద్యం మా ప్రభుత్వ మొదటి ప్రాధాన్యత. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాజకీయాలకు అతీతంగా విద్య, వైద్యానికి నిధులు విడుదల చేస్తున్నాం. ఆరోగ్యశ్రీకి గతంలో ఏడాదికి సగటున 500 కోట్లు చెల్లిస్తే, మా ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలోనే రూ.1137 కోట్లు చెల్లించాం. గతంలో ఉన్న బకాయిలను కూడా క్లియర్ చేశాం. రెగ్యులర్‌గా పేమెంట్స్ రిలీజ్ చేస్తున్నాం. మరో 6 నెలల్లో బకాయిలు లేకుండా పేమెంట్స్ క్లియర్ చేస్తాం. హాస్పిటళ్లను ఇబ్బంది పెట్టాల్సిన అవసరం మాకు లేదు. మీరు నష్టపోకూడదు, అదే సమయంలో ప్రజలకు కూడా ఇబ్బంది కలగకూడదు. ఇది ప్రజల ప్రభుత్వం.

మీరు ఎప్పుడైనా వచ్చి మీ సమస్యలను మాకు తెలియజేయడానికి అవకాశం ఉంది. మీరు లేవనెత్తిన ఇతర సమస్యలను కూడా పరిష్కరించే బాధ్యత మాది. ప్యాకేజీల రేట్లను 2013లో రివైజ్ చేశాం. మళ్లీ మా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ప్యాకేజీ రేట్లను రివైజ్ చేశాం. రివిజన్‌కు సంబంధించి హాస్పిటళ్లు లేవనెత్తిన అభ్యంతరాలను పరిశీలించేందుకు కమిటీ ఏర్పాటు చేసి, సానుకూల నిర్ణయం తీసుకుంటాం. ఇతర సమస్యలను సైతం పరిష్కరించే బాధ్యత మాది."అని మంత్రి అన్నారు. ఇతర సమస్యలపై చర్చించేందుకు హెల్త్ సెక్రటరీ, ఆరోగ్యశ్రీ సీఈవోతో సమావేశం ఏర్పాటు చేయిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ.. మంత్రి తమను పిలిచి మాట్లాడడం సంతోషంగా ఉందన్నారు. గతంలో తమతో ఎవరూ ఇలా మాట్లాడలేదన్నారు. మంత్రి హామీ మేరకు ఆరోగ్యశ్రీ, ఈహెచ్‌ఎస్, జేహెచ్‌ఎస్ సేవలు యథావిధిగా కొనసాగిస్తామన్నారు. గతంలో ఆరోగ్యశ్రీ కింద నెలకు సగటున 50 కోట్ల వరకు రిలీజ్ చేయగా, ప్రస్తుతం నెలకు సుమారు 100 కోట్ల వరకూ రిలీజ్ చేస్తున్నారని ధన్యవాదాలు తెలిపారు.



# రేషన్ కార్డులపై ప్రతిపక్షాలది దుష్ప్రచారం

### అర్హులైన ప్రతీ ఒక్కరికీ కార్డులిస్తాం

### ప్రతీ వ్యక్తికి 6కిలోల సన్నబియ్యం కూడా ఇస్తాం
### హరీష్ దుర్మార్గంగా మాట్లాడుతున్నారు
### రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**తెలంగాణ బ్యూరో, మహా:** కొత్త రేషన్ కార్డుల విషయంలో ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతీ ఒక్కరికీ రేషన్ కార్డులు ఇస్తామని, రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియ నిరంతరం జరుగుతుందన్నారు. ఆహార భద్రత చట్టం తెచ్చింది కాంగ్రెస్ పార్టీనేనని, ప్రస్తుతం 90లక్షల కార్డులు ..2 కోట్ల 80 వేల మంది లబ్దిదారులు ఉన్నారన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో 40వేలు మాత్రమే రేషన్ కార్డులు ఇచ్చారని, కొత్త, పాత ప్రక్రియ పూర్తి అయ్యాక 40లక్షల మందికి రేషన్ లబ్ధి జరుగుతుందని తమ అంచనా అన్నారు. రేషన్ కార్డుల ప్రక్రియ పూర్తి కాగానే ప్రతీ వ్యక్తికి 6కిలోల రేషన్ కూడా సన్నబియ్యం ఇవ్వబోతున్నామన్నారు. సన్న బియ్యం పంపిణీ వల్ల 11వేల కోట్ల భారం ప్రభుత్వం పై పడుతుందన్నారు. ప్రజా పాలన, ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తులు పరిశీలన చేస్తున్నామని, లిస్ట్ లో పేర్లు రాని వాళ్ళు ప్రజావాణి, గ్రామ సభల్లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. హరీష్ రావు దుర్మార్గపు మాటలు మాట్లాడుతున్నారని, అప్పుడు బీఆర్ఎస్ మోసం చేసింది.... ఇప్పుడు తాము పని చేస్తుంటే అడ్డుకుంటున్నారని మండిపడ్డారు.

# చివరి లబ్ధిదారుడి వరకు పథకాలు అందిస్తాం

### అర్హులందరికి రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు -మంత్రి పొన్నం ప్రభాకర్.. జీహెచ్‌ఎంసీలో అమలుపై సమీక్ష.. అధికారులకు దిశానిర్దేశం



**హైదరాబాద్, మహా :** అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు జారీ చేస్తామని ప్రభుత్వం స్పష్టం చేసిందని, రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఇండ్ల పథకం నిరంతరం ప్రక్రియని, చివరి లబ్ధిదారుల వరకు అందిస్తామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సోమవారం జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో మంత్రి డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి తో కలిసి జిహెచ్ఎంసి హైదరాబాద్ నగర పరిధిలో రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల సర్వే పురోగతిపై జిహెచ్ఎంసి కమిషనర్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, రేషనింగ్ అధికారి జిల్లా సరఫరా అధికారికి జోనల్ కమిషనర్లు, ఆయా ఉన్నతాధికారులతో సమీక్షించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల కోసం ఎవరు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు. అర్హులైన అందరికీ రేషన్ కార్డులు ఇవ్వడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఇంటి స్థలం ఉన్న వారితో పాటు ఇంటి స్థలం లేని వారికి ఇందిరమ్మ ఇళ్లు అందించే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. రేషన్ కార్డులకు ఇప్పటి వరకు దరఖాస్తు చేయనివారు వార్డు సభలలో దరఖాస్తు చేసుకోవచ్చని, వార్డు సభలలో వచ్చిన దరఖాస్తులను స్వీకరించడంతో పాటు గతంలో ప్రజాపాలన సేవా కేంద్రాలలో వచ్చిన దరఖాస్తులను, ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను కూడా పరిశీలించాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులను ఇవ్వడం జరుగుతుందని స్పష్టం చేశారు. రేషన్ కార్డుల మంజూరికి గాను దరఖాస్తులను స్వీకరించే ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని మంత్రి స్పష్టం చేశారు. క్షేత్ర స్థాయిలో ప్రజలకు స్పష్టంగా అవగాహన కల్పించాలన్నారు. అధికారులందరూ టీమ్ గా పనిచేసి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలాంబర్తి, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి, జోనల్ కమిషనర్లు హేమంత్ కేశవ్ పాటిల్, అనురాగ్ జయంతి, అపూర్వ్ చౌహాన్, వెంకన్న, ఉపేందర్ రెడ్డి, రవికిరణ్, అడిషనల్ కమిషనర్ అలివేలు మంగ తాయారు, శివకుమార్ నాయుడు, సంబంధిత అధికారులు, రెవెన్యూ డివిజన ల్ అధికారులు పాల్గొన్నారు.

# నేను మారిపోయా..

## ఇకపై గౌరవం పెంచే సినిమాలే చేస్తా

### కన్నీళ్లతో రాంగోపాల్ వర్మ ఆసక్తికర ట్వీట్లు

### సత్య నా కళ్లు తెరిపించింది.. ఈ సినిమా చూసి ఏడ్చా
### ఓ సినిమాతీస్తే గానీ నమ్మలేం అంటున్న నెటిజన్లు



**హైదరాబాద్, మహా :** దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ ట్విట్టర్ వేదికగా ఓ ఆసక్తికరమైన పోస్ట్ చేశారు. ఇకపై దర్శకుడుగా తన గౌరవాన్ని పెంచే సినిమాలే తీయాలని నిర్ణయించుకున్నానని రాసుకొచ్చారు. ఈ నేపథ్యంలో ఓ సుదీర్ఘమైన పోస్ట్ పెట్టారు. '27 ఏళ్ల తర్వాత మొదటిసారి 'సత్య' చూశాను. నాకు తెలియకుండానే కన్నీళ్లు వచ్చాయి. ఎందుకంటే కేవలం సినిమా కోసం కాదు.. ఆ తర్వాత జరిగిన పరిణామాలు గుర్తొచ్చాయన్నారు. ఒక సినిమాను చిత్రీకరించడమంటే బిడ్డకు జన్మనివ్వడంతో సమానం. సినిమా తీసిన తర్వాత ఇతరులు దాని గురించి ఏం చెబుతారనేది కూడా ముఖ్యమే. నేను తీసిన చిత్రాలు హిట్ అయినా.. కాకపోయినా.. నేను పనిలో నిమగ్నమై ముందుకుసాగుతున్నాను. రెండు రోజుల క్రితం 'సత్య' సినిమా చూసినప్పుడు ఎన్నో విషయాలు గుర్తొచ్చాయి' అని రాసుకొచ్చారు. చాలా రోజుల తర్వాత ఈ చిత్రాన్ని బెంచ్‌మార్క్‌గా ఎందుకు పెట్టుకోలేదని అనిపించిందన్న వర్మ.. అలాగే ఈ చిత్రంలోని భావోద్వేగం వల్ల తనకు కన్నీళ్లు రాలేదని, ఇంత గొప్ప జానర్ సినిమాను నేనే తీశాను అనే ఆనందానికి వచ్చాయని అర్థమైందన్నారు. 'సత్య' లాంటి గొప్ప సినిమా చూసి నాపై ఎంతోమంది పెట్టుకున్న నమ్మకాన్ని నేను నిలబెట్టుకోలేకపోయాననే అపరాధభావంతో నాకు కన్నీళ్లు వచ్చాయి' అని రాసుకొచ్చారు. ఇక సినిమాలు ఇచ్చిన విజయం అహంకారంతో తన కళ్లునెత్తికెక్కాయన్న వర్మ.. సత్య' గొప్పతనం రెండు రోజుల ముందు దాన్ని మరోసారి చూసేవరకూ అర్థం కాలేదన్నారు. రంగీలా, సత్యలాంటి చిత్రాలు ఇచ్చిన వెలుగులో నా కళ్లు మూసుకుపోయాయన్న వర్మ, తనకు ఇష్టం వచ్చినట్లు సినిమాలు తీశానని, అతి తెలివితో అసభ్య సన్నివేశాలతో కూడిన సినిమాలు, ఇలా అర్థంపర్థంలేని విషయాలతో కథ, కథనాలపై ఏమాత్రం దృష్టి పెట్టకుండా సినిమాలు తీశానన్నారు. సాధారణ కథతోనూ మంచి ఎలివేషన్ ఉన్న సినిమాలు చేయొచ్చని, కానీ తాను అలా చేయలేకపోయానని వర్మ పేర్కొన్నారు.

**నా సత్యపై ప్రమాణం చేసి చెబుతున్నా**

సత్య తీసిన తర్వాత తాను ఎన్నో సినిమాలు చేశానన్న వర్మ.. అవి కూడా 'సత్య' అంత బాగుంటాయా అని తనను ఎవరూ అడగలేదన్నారు. కనీసం ఇలా తనను తాను కూడా ప్రశ్నించుకోలేకపోవడం దారుణన్న వర్మ, ఏదైనా సినిమా తీయాలని నిర్ణయించుకునే ముందు 'సత్య'ను కచ్చితంగా చూడాలనే నియమాన్ని పెట్టుకున్నానన్నారు. ఇప్పటివరకు తీసిన చిత్రాలకు ఈ నియమాన్ని పాటించినట్లైతే 90 శాతం చిత్రాలు తెరకెక్కించేవాడిని కాదేమో అన్నాడు. చివరగా ఓ ప్రతిజ్ఞ చేస్తున్నానన్న వర్మ తన జీవితంలో ఇంకా సగభాగం మిగిలే ఉందని, దానిని గౌరవంగా పూర్తిచేయాలనుకుంటున్నా అన్నాడు. సత్య లాంటి సినిమాలను తెరకెక్కించాలనుకుంటున్నాను. ఇదే సత్యం. ఈ సత్యాన్ని నా సినిమా 'సత్య'పై ప్రమాణం చేసి చెబుతున్నాను అంటూ పెద్ద పోస్ట్ చేశారు.

# ములుగులో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్

### ప్రారంభించిన మంత్రి సీతక్క



**హైదరాబాద్, మహా:** ములుగు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఇందిరా మహిళా శక్తిక్యాంటీన్ ను రాష్ట్ర పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ములుగు జిల్లాలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని, అందులోనే భాగంగా కొన్ని కార్పొరేట్ కంపెనీలు సీఎస్ఆర్ ఫండ్ ద్వారా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారని, సోమవారం ములుగు జిల్లా ఏరియా హాస్పిటల్ లో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ను ఏర్పాటు చేశామన్నారు. వైద్య సేవల కోసం వచ్చే ప్రజలకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలనే ఉద్దేశంతో ఈ క్యాంటీన్ అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. అంతేకాకుండా మహిళా శక్తి క్యాంటీన్ ఏర్పాటు ద్వారా మహిళా సంఘాలకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయనే ఉద్దేశంతో ప్రభుత్వం సబ్సిడీ రుణాలను ఇస్తూ ప్రోత్సహిస్తుందన్నారు. దీంతో మహిళలు తలెత్తుకొని తిరిగే విధంగా ప్రభుత్వం పని చేస్తుందని మంత్రి సీతక్క అన్నారు. జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., అదనపు కలెక్టర్, ఏరియా ఆసుపత్రి సూపరంటెండెంట్ జగదీష్, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ మోహన్ లాల్, మహిళలు, హాస్పటల్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఏపీలో భారీగా ఐపీఎస్‌ల బదిలీ

### ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం


**ఏపీ, మహా:** ఆంధ్రప్రదేశ్ లో భారీగా ఐపీఎస్ అధికారులు బదిలీ అయ్యారు. 27 మంది ఐపీఎస్‌లను బదిలీ చేస్తున్నట్లుగా సోమవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. రాజీవ్ కుమార్ మీనాను ఏపీ పోలీస్ రిక్రూట్ మెంట్ బోర్డు చైర్మన్ గా నియామకమయ్యారు. శాంతిభద్రతల అదనపు డీజీగా మధుసూదన్ రెడ్డిని నియమించారు. ఐజీపీ(ఆపరేషన్స్) గా శ్రీకాంత్ బదిలీ అయ్యారు. అదేవిధంగా టెక్నికల్ సర్వీసెస్ ఐజీపీగా కూడా ఆయనకు అదనపు బాధ్యతలను అప్పగించారు. ఏపీఎస్పీ బెటాలియన్ ఐజీపీగా రాజకుమారి, ఏపీ ఫోరెన్సిక్ ల్యాబ్ డైరెక్టర్ గా జి. పాలరాజు నియామకమయ్యారు.

# ప్యాకెట్ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన కంది శ్రీనివాస రెడ్డి

**ఆదిలాబాద్, మహా :** ఆదిలాబాద్ జిల్లా వయో వృద్ధుల సంక్షేమ సంఘం నూతన సంవత్సర ప్యాకెట్ క్యాలెండర్ ను ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కంది శ్రీనివాస రెడ్డి తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. అనంతరం కంది శ్రీనివాస రెడ్డి ని సంఘ సభ్యులు శాలువాతో సత్కారించి నూతన సంవత్సర సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కంది శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ వయో వృద్ధుల సంక్షేమం కొరకు తన శాయశక్తులా కృషి చేస్తానని తెలిపారు. సంఘం ఆధ్వర్యంలో చేపట్టే కార్యక్రమాలకు తనవంతు సహకారముంటుందని అన్నారు.



# డొనాల్డ్ ట్రంప్ రిటర్న్స్




(మొదటిపేజీ తరువాయి)

దీంతో ఈసారి ఈ కార్యక్రమాన్ని భవనం లోపల ఉండే రోటుండా సముదాయంలో నిర్వహించారు. అంతకుముందు అమెరికా ఉపాధ్యక్షుడిగా తెలుగింటి అల్లుడు జేడీ వాన్స్‌తో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బ్రెట్ కవానా ప్రమాణం చేయించారు. పక్కన తన కుమార్తెను ఎత్తుకుని ఉషా వాన్స్ నిల్చున్నారు. ప్రమాణం అనంతరం అక్కడున్న వారంతా కేరింతలతో జేడీ వాన్స్‌కు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమానికి భారత్ తరపున విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ హాజరయ్యారు. ప్రమాణస్వీకారోత్సవానికి ప్రపంచవ్యాప్తంగా వివిధ రంగాల ప్రముఖులు, ట్రంప్ అభిమానులు హాజరయ్యారు. అమెరికాతో సంబంధాలకు ప్రపంచ దేశాలు ఆసక్తిగా ఎదురుచూస్తుండగా, భారత్ సైతం వాషింగ్టన్‌తో భారత్ సంబంధాలను సరికొత్త శిఖరాలకు తీసుకువెళ్లాలని ఆకాంక్షిస్తోంది. అంతకుముందు అమెరికా అధ్యక్షుడిగా బైడెన్ తన సతీమణి జిల్‌తో కలిసి శ్వేత సౌధంలో చివరి సెల్ఫీ తీసుకున్నారు. ఐలవ్యూ అమెరికా అంటూ పోస్ట్ చేశారు.

**భారత్ తరుపున**

భారతదేశం నుంచి ప్రధాని మోదీ తరపున ట్రంప్ ప్రమాణ స్వీకారానికి విదేశాంగమంత్రి జైశంకర్ హాజరయ్యారు. అలాగే ప్రమాణస్వీకారానికి అంబానీ దంపతులు కూడా వచ్చారు. ప్రపంచ వ్యాపార దిగ్గజాలు ఎలాన్ మస్క్, మార్క్ జుకర్‌బర్గ్, జెఫ్ బెజోస్, సామ్ ఆల్ట్‌మన్, సుందర్ పిచాయ్ వంటివారు హాజరయ్యారు. ఈసారి ట్రంప్ ప్రమాణ స్వీకారోత్సవ ఖర్చులు కోసం దాదాపు రూ.1,400 కోట్ల విరాళాలు సేకరించారు. దీనికి బెజోస్, జుకర్‌బర్గ్, ఉబెర్ సీఈఓ ఖోస్రోషాహీనే చెరో రూ.8,65 కోట్లను విరాళంగా ఇచ్చారు. ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీకి భారీగా విరాళాలు అందించిన పెద్ద స్థాయి దాతలకు ప్రత్యేక ప్రైవేటు విందును ఏర్పాటు చేశారు.

**నీ దూకుడు సాటెవ్వడు**

దూకుడు ట్రంప్ నైజం. ఏటికి ఎదురీదడం ఆయన తత్వం. తెంపరితనం ఆయనకు ఆయుధం. వాటినే అస్త్రాలుగా మల్చుకొని అగ్రరాజ్య అధినేతగా రెండు సార్లు విజయం సాధించారు. ఆయనే డొనాల్డ్ ట్రంప్. తన దూకుడుతో రియల్ ఎస్టేట్ టైకూన్‌గా ఎదిగిన ట్రంప్ రాజకీయ రంగంలో మరింత దుందుడుకు వైఖరితో అమెరికన్ల హృదయాలు కొల్లగొట్టారు. ఎన్నో ఆరోపణలు, మరెన్నో కేసులు ఎదుర్కొంటున్నప్పటికీ, ఏమాత్రం వెనకడుగు వేయకుండారెట్టించిన మొండిధైర్యంతో రెండోసారి అమెరికా పీఠాన్ని అధిష్టించి వావ్ అనిపించారు.



# కుంభమేళాకు 8.5 కోట్ల భక్తులు

## ప్రయాగరాజ్‌లో ఎటు చూసినా జనసందోహం.. వివరాలు వెల్లడించిన ప్రభుత్వం

## క్యూ కడుతున్న విదేశీయులు.. ఎలాన్ మస్క్ సైతం వచ్చేందుకు ఇంట్రెస్ట్!

కుంభమేళాకు భక్తులు భారీగా తరలిరావడంతో అక్కడి ప్రభుత్వానికి భారీగా ఆదాయం సమకూరుతోంది. సుమారుగా రూ. 2 నుంచి 5 లక్షల కోట్ల వరకు ఆదాయం రావొచ్చని ప్రభుత్వం అంచనా వేసిన విషయం తెలిసిందే. అయితే,

### ప్రభుత్వానికి భారీగా ఆదాయం

2019లో జరిగిన కుంభమేళాకు 24 కోట్ల మంది భక్తులు తరలిరాగా, అప్పుడు యూపీ ప్రభుత్వానికి రూ. 1.2 లక్షల కోట్ల ఆదాయం సమకూరిందని ప్రభుత్వం పేర్కొన్న విషయం విధితమే. ఈసారి కుంభమేళాకు 40 కోట్లకు పైగా భక్తులు హాజరవుతారని, ఆదాయం కూడా ప్రభుత్వానికి భారీగా సమకూరుతుందని అంచనా వేస్తోంది.

*మహాకుంభమేళాకు భారీగా భక్తులు హాజరవుతున్నారు. యూపీలోని ప్రయాగరాజ్ లో ప్రతి 12 ఏళ్లకోసారి జరిగే ఈ జాతర ప్రపంచంలోనే అతిపెద్ద జాతర. జనవరి 13న ప్రారంభమైన ఈ జాతర ఫిబ్రవరి 26న ముగియనుంది. మొత్తం 45 రోజులపాటు జరగనున్న ఈ కార్యక్రమానికి 40 కోట్ల మంది భక్తులు హాజరయ్యే అవకాశముందని యూపీ ప్రభుత్వం అంచనా వేసింది. తొలిరోజు భక్తులు భారీగా పోటెత్తిన విషయం తెలిసిందే. గంగ, యమున, సరస్వతి నదులు కలిసే త్రివేణి సంగమం వద్ద దాదాపు 1.50 కోట్ల మంది పవిత్ర స్నానాలు ఆచరించారు. మహాకుంభమేళకు వస్తున్న భక్తుల సంఖ్య రోజురోజుకు భారీగా పెరుగుతోంది. ఇందుకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు విడుదల చేస్తున్నారు. సోమవారం మధ్యాహ్నం వరకు త్రివేణి సంగమం వద్ద 22.79 లక్షల మంది భక్తులు స్నానం ఆచరించగా, ఇప్పటివరకు 8.5 కోట్లకు పైగా భక్తులు కుంభమేళాకు హాజరైనట్లుగా పేర్కొన్నారు. దీంతో భారీగా వస్తున్న భక్తులతో మహాకుంభమేళా కిటకిటలాడుతోంది. ప్రయాగరాజ్ భక్తిపారవశ్యంతో కనిపిస్తోంది.* - మహా

**కుంభమేళాకు క్యూ కడుతున్న విదే-శీయులు**

కేవలం భారతదేశం నుంచే కాకుండా ఇతర దేశాల నుంచి కూడా ప్రయాగరాజ్ ను సందర్శించి, త్రివేణి సంగమం వద్ద పవిత్ర స్నానం చేస్తున్నారు. ఫిజీ, ఫిన్లాండ్, గుయానా, మలేసియా, మౌరిటియస్, సింగపూర్, సౌతాఫ్రికా, శ్రీలంక, ట్రినిడాడ్ అండ్ టోబాగో, యూఏఈతోపాటు పలు దేశాల నుంచి విదేశీయులు భారీగా తరలివస్తున్నారు. దీంతో ఈసారి విదేశీ పర్యాటకుల సంఖ్య భారీగా పెరుగుతోంది. ఇటు స్వదేశీయులు, అటు విదేశీయులతో ప్రయాగ్ రాజ్ సందడిసందడిగా మారింది. దీంతో కుంభమేళాలో ఎటు చూసినా జన సందోహమే కనిపిస్తోంది.

**విదేశీ మీడియా సైతం ఫోకస్..**

మహాకుంభమేళా ప్రపంచాన్ని ఆకర్శిస్తోండడంతో విదేశీ మీడియా కూడా ఫోకస్ చేసింది. ప్రత్యేకంగా కవరేజ్ చేస్తోంది. దీంతో ప్రపంచ వ్యాప్తంగా కుంభమేళాపై చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో విదేశీయులు విచ్చేసేందుకు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు.

**కుంభమేళాకు రానున్న ఎలాన్ మస్క్..?**

మహా కుంభమేళా 2025కు టెస్లా సీఈఓ ఎలాన్ మస్క్ కు కూడా వచ్చేందుకు ఇంట్రెస్ట్ చూపుతున్నారని ఆయనతో సన్నిహితంగా ఉండే పలువురు ప్రముఖులు అభిప్రాయపడుతున్నారు. కుంభమేళాకు హాజరుకావాలని ఆయనను ఆహ్వానించగా అందుకు ఆయన సుముఖత వ్యక్తం చేశారంటూ రితేష్ తోపాటు పలువురు సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు.

**22న యూపీ కేబినెట్ ప్రత్యేక సమావేశం**

భారీగా ఏర్పాట్లు చేసిన ఆ రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూనే ఉంది. ఆదివారం అగ్నిప్రమాదం సంభవించిన విషయం తెలిసిందే. అయితే, సంబంధిత అధికారులు, సిబ్బంది ఎప్పుడూ అలర్ట్ గా ఉండడంతో పెను ప్రమాదం తప్పింది. వెంటనే అలర్ట్ అయిన ఫైర్ సిబ్బంది ఆ మంటలను ఆర్పివేశారు. ఇలా పూర్తి స్థాయిలో మహాకుంభమేళాలో భక్తులకు భారీ భద్రతను యూపీ ప్రభుత్వం కల్పిస్తోంది. అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటోంది. రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూనే ఉన్నారు. ఈ నెల 22న యూపీ ప్రభుత్వం ప్రత్యేక సమావేశమై, మహా కుంభమేళాకు సంబంధించి చర్చించనున్నారు. కుంభమేళా ఎలా కొనసాగుతోంది..? బడ్జెట్, ఏర్పాట్లు, తీసుకోవాల్సిన చర్యలతోపాటు తదితర అంశాలపై చర్చించనుంది.

**భారీగా పెరిగిన రేట్లు**

అన్ని ప్రాంతాల నుంచి ప్రత్యేక రైళ్లు నడుస్తున్నాయి. ఇటు ప్రత్యేక విమానాలు సైతం నడుస్తున్నాయి. దీంతో ఎక్కడ చూసినా కూడా రైల్వే స్టేషన్లు, విమానాశ్రయాలు, బస్ స్టేషన్లు కుంభామేళాకు వెళ్తున్న భక్తులతో కిటకిటలాడుతున్నాయి. ప్రయాగరాజ్ కు భక్తులు భారీగా వెళ్తుండడంతో ఎప్పటికప్పుడు ప్రత్యేక బస్సులు, ట్రైన్స్, విమానాలను నడుపుతున్నారు. అయితే, పలు విమానయాన సంస్థలు స్పెషల్ సర్వీసెస్ ను నడుపుతున్న మాట వాస్తవమే కానీ, రేట్లను భారీగా పెంచాయంటూ ప్రయాణికులు వాపోతున్నారు.

**గూగుల్‌లోనూ కుంభమేళాకు గులాబీల వర్షం...**

ప్రముఖ టెక్ దిగ్గజ కంపెనీ అయినటువంటి గూగుల్ సంస్థ కూడా మహాకుంభమేళాకు ప్రత్యేక ప్రిఫరెన్స్ ను ఇస్తోంది. సృజనాత్మకంగా సెలబ్రేట్ చేస్తోంది. కుంభమేళా లేదా మహాకుంభమేళా అని గూగల్ లో సెర్చ్ చేయగానే గులాబీ రేకులతో కూడిన వర్చువల్ యానిమేషన్ ఆకర్షణగా నిలుస్తోంది. గులాబీల వర్షం పడుతున్నట్లుగా ఎంతో ఆసక్తిగా పేజీ కనిపిస్తోంది. ఇలా గూగుల్ కుంభమేళా ప్రాముఖ్యతను గుర్తుచేస్తోంది.



### ఇతర ప్రాంతాలూ కిటకిట

కుంభమేళాతోపాటు ఇతర ఆధ్మాత్మిక ప్రాంతాలను సందర్శిస్తున్నారు. గంగా-యమునా నదుల ఒడ్డున ఉన్న బడే హనుమాన్ ఆలయం, ఆనంద్ భవన్, అలహాబాద్ కోట, చంద్రశేఖర్ ఆజాద్ పార్క్, ఖుస్రో బాగ్ తోపాటు పలు ప్రాంతాలను పర్యాటకులు సందర్శిస్తున్నారు. దీంతో ప్రస్తుతం యూపీలో ఎక్కడ చూసినా సందర్శకుల సందడి నెలకొంది.

**రచనలకు ఆహ్వానం**

ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.

మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp-
7436939999

# స్టేటస్ పెంచే వాట్సాప్ స్టేటస్...

## నిజం బాసూ...

స్టేటస్ కూడా స్టేటస్ పెంచుతుందని మీకు తెలుసా. ప్రస్తుతం సమాజంలో నడుస్తున్న ట్రెండ్ ఏంటో తెలుసా? బాధొచ్చిందా వాట్సాప్ స్టేటస్, సంతోషం వచ్చిందా వాట్సాప్ స్టేటస్. ఎటైనా ట్రిప్ వెళ్లారా, వాట్సాప్ స్టేటస్, ఎవరిపైనా కోపం వచ్చిందా మళ్లీ వాట్సాప్ స్టేటస్. ఏం చేసినా స్టేటసే. యువత లవ్ బ్రేకప్ అయినా కూడా వాట్సాప్ స్టేటసే స్నేహితుడిలా సాంత్వన కోరుకుంటోంది. వాట్సాప్ ఇంతగా మన జీవితాల్ని పెనవేసుకున్న సమయంలో మంచి చెడుల మిశ్రమంగా సాగుతోన్న స్టేటస్ కథ ఇది. వాట్సాప్ స్టేటస్ మనిషి మానసిక స్థితిని ప్రభావితం చేయడమే కాదు. వ్యక్తి పరిస్థితికి అద్దం పట్టేదిగా మారుతోంది. చాలామంది ప్రతిరోజు దేవుళ్ల స్టేటస్ పెడుతుంటారు. ఒక్కోరోజు ఒక్కో దేవుడికి ప్రత్యేకంగా స్టేటస్ వేదికగా పూజలు చేస్తుంటారు. మనోభావాలు ఏవైనా వెంటనే వాటిని వ్యక్తపరిచేందుకు వాట్సాప్ స్టేటస్ ను ఎంచుకుంటున్నారు. ఏ పండుగైనా, సన్నిహితుల ప్రత్యేక రోజుల్లోనూ వాట్సాప్ స్టేటస్ శుభాకాంక్షలకు వేదికవుతోంది. అలాగే ఏదైనా సాధించినప్పుడు మనవాళ్లు ఎవరైనా ప్రతిభ కనబర్చినప్పుడు ఆ విషయాన్ని పదిమందికి చేర్చేందుకు, ప్రతిభకు పట్టం కట్టించేందుకు సైతం వాట్సాప్ స్టేటస్ సాయపడుతోంది. అయితే వాట్సాప్ స్టేటస్ పెట్టడమే హోదాగా భావించే వాళ్లు వారు అనుకున్న రీతిలో లైక్‌లు, కామెంట్లు రాకుంటే మాత్రం అసంతృప్తికి కూడా గురవుతున్నారు. బాధ సంతోషమే కాదు. కోపాన్ని సైతం ప్రదర్శిస్తున్నారు.

### స్టేటస్‌తో చెప్పేద్దాం

పనిచేసే చోట వ్యక్తులతో, బంధువులతో మనస్పర్థలు వచ్చినా వ్యంగంగా విమర్శనాస్త్రాలు సంధిస్తుంటారు. అంతేగాక విజ్ఞానానికి సంబంధించినవి, రాజకీయానికి సంబంధించిన అంశాలతో పాటు వివిధ అంశాలకు సంబంధించి అవగాహన కల్పించేలా సైతం ఉపయోగిస్తున్నారు. అలాగే వ్యాపార ప్రకటనలకు సైతం వాట్సాప్ స్టేటస్ వేదికవుతోంది. తమ తమ వ్యాపారాలకు సంబంధించిన పోస్టర్లు, లింక్‌లతో తెరపైకి వస్తుంటారు నిర్వాహకులు. అయితే నిర్వాహకులకు తెలియకుండానే కొన్నిసార్లు సైబర్ నేరగాళ్లు లింక్‌ల రూపంలో వచ్చే అవకాశం ఉందని, ఫొటోలు మార్ఫింగ్ చేసే అవకాశం ఉందని, కాస్త అప్రమత్తత అవసరమని సైబర్ నిపుణులు సూచిస్తున్నారు.

### దినచర్యే

ఏదేమైనా వాట్సాప్ స్టేటస్ స్మార్ట్‌ఫోన్లు వాడుతున్న వారిలో 90% మందికి దినచర్యలా మారింది. ఒక్కొక్కరు ఒక్కోలా స్టేటస్ పెడుతుంటే మరికొందరు అసలు స్టేటస్ పెట్టకూడదనే కృత నిశ్చయంతో దాన్నే పాటిస్తుంటారు. ఒకరు రోజుకు ఒక స్టేటస్ పెడుతుంటే, మరొకరు జరిగే చిన్న విషయాన్ని అందరితో పంచుకుంటూనే ఉంటారు. మితంగా ఉన్నంత వరకు అన్ని బాగానే ఉంటాయి. అతి కాకుండా అప్రమత్తతతో వ్యవహరించాలని, మానవ సంబంధాలు పెంచుకునేందుకు వాట్సాప్ స్టేటస్‌ను ఉపయోగిస్తే సమాజంలో మన స్టేటస్ కూడా పెరుగుతుందని నిపుణులు చెబుతున్నమాట. ఇదీ స్టేటస్ కహానీ.



# ఎయిర్ ట్యాక్సీలు రాబోతున్నాయ్

మహా SPECIAL REPORT

## ప్రయాణికులను గాలిలో తిప్పబోతున్న శూన్య

- భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పోలో కనిపించిన నమూనా
- గంటకు 250 కిలోమీటర్ల వేగంతో ప్రయాణం
- ఒకేసారి ఆరుగురు ప్రయాణించే అవకాశం
- ఛార్జీలు కూడా తక్కువేనంటా
- హైదరాబాద్‌లోనూ ఎయిర్ ట్యాక్సీ సేవలు
- సూపర్ ఐడియా అంటూ ప్రశంసలు



**మహా, ఫీచర్స్ డెస్క్:**

ఎటైనా వెళ్లాలంటే ఆటోలు, కార్లు, బైక్ లను బుక్ చేసుకుని రయ్ రయ్ మని వెళ్లిపోతుంటారు. అయితే, త్వరలోనే ఎయిర్ ట్యాక్సీలు కూడా అందుబాటులోకి రాబోతున్నాయి. రోడ్డు మీద ఆటోలు, ట్యాక్సీలను ఎక్కినట్టుగానే ఈ ఎయిర్ ట్యాక్సీలను ఎక్కి, గాలిలో ప్రయాణించొచ్చు. అంతేకాదు అత్యవసర వైద్య సేవల కోసం ఉచిత ఎయిర్ అంబులెన్స్ సేవలను సైతం అందించేందుకు బెంగళూరుకు చెందిన స్టార్టప్ కంపెనీ సిద్ధమైంది. ఇందుకు సంబంధించిన నమూనా ఎయిర్ ట్యాక్సీని తాజాగా ఢిల్లీలో ప్రదర్శించింది. ప్రయాణికులు సాధారణంగా ట్యాక్సీలను బుక్ చేసుకుని తమ గమ్యస్థానాలకు వెళ్తుంటారు. అయితే, నగరాలల్లో ట్రాఫిక్ రద్దీ రోజురోజుకు విపరీతంగా పెరిగిపోతోంది. దీంతో ప్రయాణికులు సమయానికి గమ్యస్థానాలకు చేరుకోలేకపోతున్నారు. ఇటు వాహనదారులు సైతం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాదాచారులకు సైతం ఈ ట్రాఫిక్ కారణంగా చుక్కలు చూడాల్సి వస్తోంది. మరోవైపు శబ్ధ కాలుష్యం కూడా మితిమీరిపోతుంది. అయితే, ఈ సమస్యలన్నింటికీ చెక్ పెట్టేందుకు ఓ స్టార్టప్ కంపెనీ ముందుకొచ్చింది. అందులో భాగంగా వినూత్నంగా ఆలోచించి, ఎయిర్ ట్యాక్సీ సేవలను అందించేందుకు రెడీ అవుతోంది. ఇందుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం కూడా రూట్ మ్యాప్ ను సైతం సిద్ధం చేసింది. దీంతో ఎయిర్ ట్యాక్సీలో ఎక్కి గాలిలో ప్రయాణించే సదుపాయం త్వరలోనే రాబోతుంది.

### ఫస్ట్ ఎయిర్ ట్యాక్సీ

ఇండియాలో మొట్టమొదటి ఎయిర్‌ట్యాక్సీ నమూనాను ఓ స్టార్టప్ కంపెనీ తాజాగా ప్రదర్శించింది. ప్రస్తుతం ఢిల్లీలో జరుగుతున్న భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పోలో ఎయిర్ ట్యాక్సీ 'శూన్య'ను బెంగళూరుకు చెందిన ఏరోస్పేస్ స్టార్టప్ 'సరళా ఏవియేషన్' ఆవిష్కరించింది. ఈ ఎయిర్ ట్యాక్సీ సేవలను 2028 నాటికి బెంగళూరు నగర పరిధిలో ప్రారంభిస్తామని సదరు కంపెనీ వెల్లడించింది. 'శూన్య' ఎయిర్ ట్యాక్సీ గంటకు 250 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే కెపాసిటీని కలిగి ఉంది. 20 నుంచి 30 కిలోమీటర్ల స్వల్ప దూరంలో రాకపోకలు సాగించేందుకు వీలుగా ఈ ఎయిర్ ట్యాక్సీని రూపొందించారు. ఇందులో ఆరుగురు ప్రయాణికుల వరకు ప్రయాణించేలా, మహా నగరాల పరిధిలో ప్రజల అత్యవసర వైద్య సేవల కోసం ఉచిత ఎయిర్ అంబులెన్స్ సేవలను అందుబాటులోకి తేవాలనే ఆలోచనలో ఉన్నామంటూ కూడా శూన్య పేర్కొంది.





### త్వరలో హైదరాబాద్‌కు..

గరిష్టంగా 680 కిలోల బరువును ఈ ఎయిర్ ట్యాక్సీ మోయనున్నదని శూన్య తెలిపింది. అడ్రియన్ స్మిత్, రాకేష్ గాంకర్, శివమ్ చౌహాన్ అనే ముగ్గురు సరళా ఏవియేషన్ ను 2023 అక్టోబర్ నెలలో ప్రారంభించారు. వినూత్నంగా ఆలోచించిన ఈ స్టార్టప్ కంపెనీలో ఫ్లిప్ కార్ట్ సహ వ్యవస్థాపకుడు బిన్నీ బన్సల్, జెరోధా సహ వ్యవస్థాపకుడు నిఖిల్ కామత్ వంటి ఇన్వెస్టర్లు సైతం పెట్టుబడులు పెట్టారు. మొదటగా బెంగళూరులో ఈ ఎయిర్ ట్యాక్సీ సేవలను ప్రారంభించి, ఆ తరువాత ముంబై, పూణె, ఢిల్లీ సహా ప్రధాన నగరాలకు విస్తరించనున్నట్లు కంపెనీ తెలిపింది. ఆ తరువాత చెన్నై, హైదరాబాద్ వంటి ఇతర నగరాలకు విస్తరించనున్నట్లు వారు వివరించారు.

### ధర కూడా తక్కువే...!

ఈ ఎయిర్ ట్యాక్సీలో ప్రయాణించేందుకు ఎక్కువగా ఖర్చు కాదంటా. ఇప్పటికే ఉన్నటువంటి ప్రీమియం ట్యాక్సీ సేవలతో సమానంగా ఎయిర్ ట్యాక్సీ ధరలకు సేవలందించనున్నట్లు సదరు ఏవియేషన్ సంస్థ స్పష్టం చేసింది. ఇందులో ప్రయాణించడానికి ప్రయాణికుడికి అయ్యే ఖర్చు కార్ ట్యాక్సీల కంటే కొంత ఎక్కువగా మాత్రమే ఉండనున్నదని తెలుస్తోంది. దీంతో ఎయిర్ ట్యాక్సీలో ప్రయాణించేందుకు జనాలు ఎక్కువగా ఆసక్తి చూపే అవకాశముందని చెబుతున్నారు.

### వావ్హా.. భలే ఐడియా గురూ..

ఢిల్లీలో ఎయిర్ ట్యాక్సీ నమూనాను చూసి జనాలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. శూన్య కంపెనీ వినూత్నంగా ఆలోచించిదంటూ ప్రశంసిస్తున్నారు. ఈ విధంగా ఎయిర్ ట్యాక్సీలను ఏర్పాటు చేస్తే చాలామంది వీటిని వినియోగించుకునే అవకాశం లేకపోలేదని చెబుతున్నారు. అయితే, సాధారణంగా హెలికాప్టర్లలో ప్రయాణం అంటే భారీ ఖర్చుతో కూడుకున్నదని, కానీ, తక్కువ ధరలోనే ఎయిర్ ట్యాక్సీ సేవలను అందించేందుకు సిద్ధమవ్వడమనేది అభినందించదగ్గ విషయమంటున్నారు. ఇదిలా ఉంటే.. ఎయిర్ ట్యాక్సీకి సంబంధించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో భారీగా వైరల్ అవుతున్నాయి. నెటిజన్స్ చూసి మీ ఐడియా బాగుందంటూ కామెంట్స్ చేస్తున్నారు. మరికొంతమైందైతే రోడ్లపైన ట్రాఫిక్ తో పిచ్చెక్కిపోతుంది.. త్వరగా ఎయిర్ ట్యాక్సీలను తీసుకువస్తే కొంతవరకైనా ఆ సమస్య తీర్చినట్టవుతుందని వారు అభిప్రాయపడుతున్నారు.

# చిమ్మచీకటిలో మౌలిక వసతుల కోసం నిలబడ్డ బాధితులు

**చీర్యాల డబుల్ బెడ్రూం కాలనీ వాసుల ఆవేదన.. చీకట్లో 40 కుటుంబాలు.. ఆదుకునే వారెవరు?**



**కీసర, మహా :** కీసర మండలం చీర్యాల గ్రామంలోని డబుల్ బెడ్రూం ఇళ్ల కాలనీలో సోమవారం విద్యుత్తు అధికారులు అక్రమ కనెక్షన్ల పేరుతో విద్యుత్తు సరఫరా నిలిపివేయడంతో సుమారు 40 కుటుంబాలు చిమ్మ చీకట్లో జీవనం సాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

**అక్రమ కనెక్షన్ల ఆరోపణలు**

విద్యుత్తు అధికారులు అక్రమ కనెక్షన్ల పేరుతో విద్యుత్తు కట్ చేశారని పేర్కొంటూ, కాలనీ వాసులు దీనిని తీవ్రంగా ఖండిస్తున్నారు. "ఇది అక్రమ కనెక్షన్ కాదని చెప్పినా, అధికారులు వినిపించుకోలేదు. మాకు ఎలాంటి సమాచారమూ ఇవ్వకుండానే విద్యుత్తు నిలిపివేశారు," అని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

**మౌలిక వసతుల కోసం వేదన**

ఇళ్ల కేటాయింపు జరిగినప్పటి నుంచి విద్యుత్తు, నీటి సరఫరా, రహదారుల వంటి మౌలిక వసతుల లోపం వల్ల కాలనీవాసుల జీవనం దుర్భరంగా మారింది. "చీకట్లో పాములు, తేళ్ల బెడదతో భయంతో బతుకుతున్నాం. మా పిల్లల చదువుకు తీవ్ర ఆటంకం. వృద్ధుల ఆరోగ్యం కూడా ప్రమాదంలో పడుతోంది," అని వారు వాపోతున్నారు.

**తక్షణ చర్యల కోసం ప్రజల డిమాండ్**

ప్రభుత్వం మాకు ఇళ్లను కేటాయించినప్పటికీ, మౌలిక వసతుల కల్పన విషయంలో పూర్తిగా నిర్లక్ష్యం చూపుతోంది," అని వాసులు పేర్కొన్నారు. వెంటనే విద్యుత్తు పునరుద్ధరించి, మౌలిక సదుపాయాలు అందించాలని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఈ ఘటనపై విపక్షాలు స్పందిస్తూ, ప్రభుత్వం పేదల ఇళ్ల కలను వాస్తవంగా సాకారం చేయలేకపోతోంది. ప్రచారానికే పరిమితం అయిన ఈ ప్రాజెక్ట్ వల్ల ప్రజల జీవితాలు చీకట్లోనే ఉంటున్నాయి," అంటూ విమర్శించారు. 40 కుటుంబాలు చీకట్లో జీవిస్తున్న ఈ పరిస్థితి తక్షణమే పరిష్కరించి, కాలనీ ప్రజల జీవితాల్లో వెలుగులు నింపడం కోసం ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ప్రజలు ఆశిస్తున్నారు.

# అంతకు మించి

## రేవంత్ టార్గెట్ ఫిక్స్ .. దావోస్‌లో పక్కా ప్రణాళిక

## గత ఏడాది రూ.40 వేల కోట్ల పెట్టుబడులపై ఒప్పందాలు

**రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పన.. ఆర్థిక ప్రగతి లక్ష్యంగా వ్యూహం**



**హైదరాబాద్, మహా:** దావోస్ లో అడుగుపెట్టిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పక్కా ప్లాన్ తో పెట్టుబడుల సమీకరణలో దూసుకెళ్తున్నారు. గత ఏడాది దావోస్ పర్యటన సందర్భంగా రాష్ట్రానికి రూ.40 వేల కోట్ల పెట్టుబడులను ప్రభుత్వం సమీకరించింది. ఈసారి అంతకు మించి పెట్టుబడులను తేవడమే లక్ష్యంగా తమ పర్యటన కొనసాగుతుందని సీఎం రేవంత్ రెడ్డి ఇటీవల అధికారులతో సమీక్షలో వెల్లడించారు. అందుకనుగుణంగానే పకడ్బందీగా అడుగులు వేస్తున్నారు. ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు, రాష్ట్రంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి ప్రాజెక్టులతో అంతర్జాతీయ దిగ్గజ కంపెనీలు పెట్టుబడులకు ఆసక్తి ప్రదర్శిస్తాయని సీఎం భావిస్తున్నారు. ఇప్పటికే గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లకు హైదరాబాద్ అడ్డాగా మారింది. ఐటీ, ఏఐ, ఫార్మా, తయారీ రంగాలకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలతోపాటు ఇటీవల ప్రకటించిన పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి విధానం పై ప్రముఖ కంపెనీలు ఆసక్తి ప్రదర్శిస్తున్నాయి. ఈ నేపథ్యంలో గత ఏడాదికి మించి పెట్టుబడుల సాధనకు చర్చలు జరుగుతున్నాయి. దావోస్ కు ముందు జ్యూరిచ్ విమానాశ్రయంలో ఏపి సిఎం చంద్రబాబుతో మర్యాదపూర్వకంగా కలిశారు. ఓ వైపు గత ఏడాదికి మించి, మరోవైపు పక్కనున్న ఏపిని మించి సాధించాలన్న రెండు బెంచ్ మార్క్ లు ముఖ్యమంత్రి రేవంత్ ముందున్నాయి. తెలంగాణలో ప్రత్యేక పరిస్థితులు, హైదరాబాద్ అనుకూలతలు, సీఎం ప్రకటించిన ఫ్యూచర్ సిటీ, స్కిల్ యూనివర్సిటీ వంటి ఆకర్షణలు భారీ ఎత్తున పెట్టుబడుల ఆకర్షణకు, ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు దోహదపడే అవకాశాలున్నాయి. సీఎం టీమ్ లో మంత్రి శ్రీధర్ బాబుతో పాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## దావోస్‌లో తెలుగు సీఎంల రేస్

- సీఎం రేవంత్‌కు జ్యూరక్‌లో ఘనస్వాగతం
- విమానాశ్రయంలో కలుసుకున్న రేవంత్, చంద్రబాబు

**హైదరాబాద్, మహా:** తెలుగు రాష్ట్రాలు ఏపీ, తెలంగాణ మధ్య పెట్టుబడుల రేస్ మొదలైంది. రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు దావోస్‌ను టార్గెట్ చేసుకున్నారు. తమ తమ రాష్ట్రాలకు పెట్టుబడులు ఆకర్షించడానికి పోటీపడుతున్నారు. దావోస్‌లో జరిగే ప్రపంచ ఆర్థిక సదస్సులో పాల్గొనేందుకు ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, తెలంగాణ రేవంత్ రెడ్డి జ్యూరక్ చేరుకున్నారు. జ్యూరక్ విమానాశ్రయంలో చంద్రబాబు, రేవంత్ రెడ్డి కలుసుకున్నారు. పరస్పర యోగక్షేమాలు తెలు ఈ భేటీకి తెలంగాణ మంత్రి శ్రీధర్‌బాబు, ఏపీ మంత్రి నారా లోకేష్, కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు తదితరులు హాజరయ్యారు. రెండు రాష్ట్రాల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, వివిధ పెట్టుబడులపై ముఖ్యమంత్రుల మధ్య చర్చ జరిగింది. అలాగే జ్యూరక్‌లోని హోటల్ హిల్టన్‌లో "తెలుగు దయాస్పోరా మీట్"లో చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. యూరప్ దేశాల్లో నివసిస్తున్న తెలుగు పారిశ్రామికవేత్తలు..పలు కంపెనీల సిఈవోలు పాల్గొన్నారు. దావోస్‌లో తనకు స్వాగతం పలికిన యూరఫ్‌లోని తెలుగు వారికి సీఎం చంద్రబాబు నాయుడు కృతజ్ఞతలు తెలిపారు.

# గ్రామసభలలో ప్రజల అభిప్రాయాల సేకరణ

**ప్రజలు సలహాలు సూచనలు ఇవ్వచ్చు**
**ఇబ్రహీంపట్నం ఆర్డిఓ అనంతరెడ్డి**



**ఇబ్రహీంపట్నం, జనవరి 20 మహా:** జిల్లా కలక్టర్ సి. నారాయణరెడ్డి ఆదేశాల మేరకు ఈనెల 21 నుండి 24 వరకు ఇబ్రహింపట్నం డివిజన్ పరిధి, మండలాలోని 109 గ్రామ పంచాయితీలలో, గ్రామ ప్రత్యేక అధికారుల అధ్యక్షతన గ్రామ సభలు నిర్వహించడం జరుగుతుందని ఆర్డిఓ అనంతరెడ్డి తెలిపారు. ఇట్టి గ్రామ సభలలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగ చేపట్టనున్న "ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా" పథకాలు అమలులో బాగంగా పారదర్శకంగా లబ్దిదారుల ఎంపిక చేయుట గురించి చర్చించబడును. ఇట్టి గ్రామ సభలలో మీ యొక్క సలహాలు, సూచనలు, అభ్యంతరాలు మొదలైన అంశాలపై అభిప్రాయాలను స్వీకరించడును. అంతేగాక ఇట్టి గ్రామ సభలలో ఇంతవరకు దరఖాస్తు చేసుకొనివారు, ఎవరైనా ఉన్నచో అట్టి వారు కుడా తమతమ దరఖాస్తులు సమర్పించవచ్చు. కావున, ఇట్టి అవకాశాన్ని ప్రజలందరూ వినియోగించుకోవలసిందిగా సూచించారు. అంతేగాక ఇట్టి గ్రామ సభలలో ప్రజలు మరియు ప్రజా ప్రతినిదులు స్వచ్ఛందంగా పాల్గొని ఇట్టి కార్యక్రమాన్నికి సహకరించి విజయవంతం చేయవలసిందిగా విజ్ఞప్తి చేశారు.

# ఫీజుల కోసం వేధించిన పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

**రూ.7 వేల కోసం విద్యార్థిని స్కూల్ బయట నిల్చోబెట్టిన స్కూల్ యాజమాన్యం**

**ఆందోళనకు దిగిన లింగోజిగూడ కార్పొరేటర్ ధర్పల్లి రాజశేఖర్ రెడ్డి, పేరెంట్స్**



**ఎల్బీనగర్, జనవరి 20,మహా:** విద్యార్థుల మనోభావాలను దెబ్బతీసే విధంగా రూ.7వేలు ఫీజు కట్టలేదని పరీక్ష రాయనీయకుండా బయట నిల్చోబెట్టిన పాఠశాలపై చర్యలు తీసుకోవాలని జిహెచ్ఎంసి కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ ,లింగోజిగూడ డివిజన్ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్ రెడ్డి డిమాండ్ చేస్తూ స్కూల్ ముందు బాధిత పేరెంట్స్ తో కలిసి ఆందోళనకు దిగారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగోజిగూడ డివిజన్ పరిధిలోని పల్లవి అవేర్ ఇంటర్నేషనల్ స్కూల్లో ఓ విద్యార్థి తల్లిదండ్రులు ఫీజు కట్టలేదని పరీక్ష రాయనివ్వకుండ స్కూల్ మేనేజ్మెంట్ క్లాస్ రూం బయట నిలబెట్టారు.దీంతో వారి తల్లి దండ్రులు ప్రిన్సిపాల్ తో గట్టిగా వాదించిన తర్వాత పరీక్షకు అనుమతించినట్లు బాధిత పేరెంట్స్ తెలిపారు.బాధిత పేరెంట్స్ ఇచ్చిన సమాచారంతో ఘటన స్థలానికి చేరుకున్న లింగోజిగూడ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్ కాంగ్రెస్ నేతలతో కలిసి ఆందోళనకు దిగారు. రూ.7 వేలు చెల్లించని విద్యార్థిని బయటకి పంపించిన పాఠశాల యజమాన్యం గత ఎనిమిది సంవత్సరాలుగా జిహెచ్ఎంసి కి రూ. 14.63 లక్షలు బకాయిలు చెల్లించలేదని కార్పొరేటర్ తెలిపారు.విద్యార్థులపై ఇంత దారుణంగా వ్యవహరిస్తున్న స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.జిహెచ్ఎంసి పన్ను కట్టని పాఠశాలపై ఏం చర్యలు తీసుకుంటారని అధికారులను ఆయన ప్రశ్నించారు.జిహెచ్ఎంసి కి ట్యాక్స్ కట్టకపోవడంతో పాటు ఫైర్ సేఫ్టీ పర్మిషన్ లేదని ఆయన తెలిపారు.పాఠశాల నిర్వాహకులు మల్కా కొమురయ్య ఒక జాతీయ పార్టీ నుంచి ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పోటీగా నిలుస్తున్నారని, అలాంటి వ్యక్తికి ఉపాధ్యాయులు ఎలా ఓటు వేస్తారని ప్రశ్నించారు.ఈ ధర్నాలో కాంగ్రెస్ నాయకులు హస్తినాపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దెంది శశిధర్ రెడ్డి, రమేశ్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, పల్చం శ్రీధర్ గౌడ్, జూపల్లి ప్రవీణ్, కందికంటి శ్రీధర్ గౌడ్, సుధీర్ రెడ్డి, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

# ఆగపల్లిలో ప్రభుత్వ భూమిని కాపాడండి

**తెలంగాణ భూముల పరిరక్షణ సమితి అధ్యక్షులు గోడుకొండ్ల ప్రవీణ్**

**ప్రజావాణిలో కలెక్టర్‌కి ఫిర్యాదు**



**మంచాల, జనవరి 20 మహా:** ఆగపల్లిలో ఎస్ఆర్ గ్రూప్ అక్రమ వెంచర్ పై చర్యలు తీసుకొని ప్రభుత్వ భూమిని కాపాడలని తెలంగాణ భూముల పరిరక్షణ సమితి అధ్యక్షులు గోడుకొండ్ల ప్రవీణ్ సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ సి.నారాయణ రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్బంగా గోడుకొండ్ల ప్రవీణ్ మట్లాడుతూ... రంగారెడ్డి జిల్లా, మంచాల మండలం, ఆగపల్లి గ్రామంలో సర్వేనెంబర్ 191లో గల ప్రభుత్వ భూమి, సర్వే నెంబర్ 187లో గల భూముల్లో కొంత భాగం ఎస్సార్ గ్రూప్ వెంచర్ నిర్వాహకులు కబ్జా చేసి పార్కు కోసం కేటాయించారని గతంలోనే ఎన్నోసార్లు అధికారుల దృష్టికి, కలెక్టర్ దృష్టికి తీసుకురావడంతో, రెవెన్యూ అధికారులు సర్వే చేపట్టి ఇది ప్రభుత్వ భూమిగా గుర్తించి, వెంచర్లో కొంత భాగం కబ్జాకు గురైనట్లు తేల్చి, ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన వారిపై కఠిన చర్యలు తప్పవని సూచిస్తూ రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. కాలక్రమేనా వెంచర్ యజమానులు సూచిక బోర్డును తొలగించి, రోడ్డు పనులను కొనసాగించారని, అధికారుల సూచనలను బేఖాతారు చేసి ప్లాట్లు అమ్మడానికి వెంచర్ పనులు వేగవంతం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. అధికారుల కను సన్నల లోనే ఈ నిర్వాకం జరుగుతోందని ఆరోపించారు. దీనికి ప్రధాన కారణం అందెల శ్రీరాములు బినామీ, సామంత రెడ్డి 4.20 ఎకరాల అసైన్డ్ భూమిని కబ్జా చేసి ప్లాట్లుగా విక్రయిస్తున్నారని దీంతో అధికారుల అలసత్వం స్పష్టంగా కనిపిస్తుందని ధ్వజమెత్తారు. 20 రోజుల్లో మళ్లీ సర్వే చేసి ప్రభుత్వ భూమి హద్దులు ఏర్పాటు చేయకపోతే పోరాటం ఉధృతం చేస్తామని, తెలంగాణ భూముల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆమరణ నిరాహార దీక్షకైనా సిద్ధమని తెలంగాణ భూముల పరిరక్షణ సమితి అధ్యక్షుడు గోడుకొండ్ల ప్రవీణ్, కమిటీ సభ్యులు దూసరి లక్ష్మణ్ లు సోమవారం కలెక్టర్కి ప్రజావాణి ద్వారా మరోసారి విజ్ఞప్తిగా వినతిపత్రం అందజేశారు.

# అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే

**మున్సిపాలిటీకి రూ.81 కోట్ల నిధుల మంజూరు**

**శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి**



**ఇబ్రహీంపట్నం, జనవరి 20 మహా:** తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధిలో పలు వార్డులలో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గం తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డులలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సహాయ సహకారాలతో, 81 కోట్ల రూపాయల నిధులతో పలు ప్రాంతాల్లో అప్రోచ్ రోడ్లు, అంతర్గత రహదారులు మరియు మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులు చేపట్టారు. ఈ సందర్భంగా హాజరైన రోడ్ డెవలప్మెంట్ కార్పోరేషన్ ఛైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, తుర్కయంజాల్ మున్సిపల్ ఛైర్ పర్సన్ మల్ రెడ్డి అనురాధ రెడ్డి. ఈ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ... నియోజకవర్గంలోని ప్రతి గ్రామం, పట్టణం అభివృద్ధి చెందడమే మా ముఖ్య ఉద్దేశం. హైదరాబాద్ నగరానికి కూతవేటు దూరంలో ఉన్న తుర్కయాంజాల్ ప్రాంతం వేగవంతంగా అభివృద్ధి దిశగా ముందుకు సాగుతున్న సందర్భంలో ఈ అభివృద్ధి పనులను ప్రారంభించుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. మల్‌రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ... ఈ నిధులతో చేపట్టిన పనులు తుర్కయాంజాల్ మున్సిపాలిటీ ప్రజలకు సదుపాయాలను అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ప్రాజెక్టు వివరాల్లో భాగంగా రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థల మరమ్మతులు, కొత్త రోడ్ల నిర్మాణం, మరియు ఆధునిక సౌకర్యాల ఏర్పాటు వంటి అంశాలు ఉన్నాయి. ఈ అభివృద్ధి పనులు ప్రజల అవసరాలను తీర్చడమే కాకుండా, ప్రాంతం యొక్క ఆర్థిక మరియు సామాజిక పురోగతికి దోహదపడతాయని అన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# క్రీడల ద్వారా సమిష్టితత్వం.. పోరాట స్ఫూర్తి అలవాటవుతాయి

- రాచకొండ స్పోర్ట్స్ మీట్ ను ప్రారంభించిన సిపి సుధీర్ బాబు.
- సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో ప్రారంభమైన ఆరవ ఎడిషన్ రాచకొండ పోలీస్ స్పోర్ట్స్ మీట్




**ఎల్బీనగర్, జనవరి 20, మహా:** క్రీడలు మానసిక ఉల్లాసానికి,శారీరక వికాసానికి తోడ్పడుతాయని రాచకొండ సిపి సుధీర్ బాబు అన్నారు.సరూర్ నగర్ లోని స్టేడియంలో రాచకొండ పోలీస్ కమిషనరేట్ ఆరవ వార్షిక స్పోర్ట్స్ మీట్ 2025 ఘనంగా ప్రారంభమైంది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా పాల్గొన్న రాచకొండ సిపి సుధీర్ బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మన జీవితంలో చాలా ముఖ్యమని వివిధ రకాల మానసిక శారీరక ఒత్తిడులను అధిగమించడానికి క్రీడలు ఎంతో దోహదపడుతాయని అన్నారు.రాచకొండ పోలీసులు శాంతిభద్రతల పరిరక్షణ కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారని,నేరస్తులకు అత్యధికంగా శిక్ష పడే విధంగా తమ సిబ్బంది పని చేస్తున్నారని అన్నారు వారికి విధి నిర్వహణలో ఎదురయ్యే ఒత్తిళ్ల నుంచి ఉపశమనం పొంది నూతనత్తేజంతో తమ విధి నిర్వహణలో పాల్గొనేలా చేయడానికి స్పోర్ట్స్ మీట్ నిర్వహిస్తున్నామన్నారు.ఈ క్రీడా పోటీల ద్వారా వివిధ పోలీస్ విభాగాల మధ్య రిలేషన్ షిప్ ఏర్పడుతుందన్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ పోటీల్లో అన్ని రకాల ప్రధాన క్రీడా విభాగాల్లో పోటీలు నిర్వహిస్తామని అన్నారు.గెలుపోటముల కంటే పోరాటమే ధ్యేయంగా క్రీడల్లో పాల్గొనాలని పేర్కొన్నారు.ఈ పోటీల్లో పోలీసు సిబ్బంది టీమ్స్ మాత్రమే కాక మినిస్టీరియల్ సిబ్బందికి కూడా ఒక ప్రత్యేక టీమ్ ఉంటుందని అన్ని టీమ్స్ క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని,ఆటల్లో ఎటువంటి అవకతవకలకు పాల్పడకూడదని సూచించారు.ప్రతి ఏటా క్రమం తప్పకుండా పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.రాచకొండ పరిధిలో పనిచేస్తున్న అన్ని పోలీసు విభాగాల సిబ్బంది, మినిస్టీరియల్ సిబ్బంది కూడా ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యాదాద్రి డిసిపి రాజేష్ చంద్ర,ఎల్బీనగర్ డిసిపి ప్రవీణ్ కుమార్, మల్కాజ్ గిరి డిసిపి పద్మజ, క్రైమ్ డిసిపి అరవింద్ బాబు, మహేశ్వరం డిసిపి సునీత రెడ్డి,డిసిపిలు రమణారెడ్డి, మురళీధర్,ట్రాఫిక్ డిసిపి శ్రీనివాస్, అడ్మిన్ డిసిపి ఇందిరా,సైబర్ క్రైమ్ డిసిపి నాగలక్ష్మి ఇతర అధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థినులకు ఏఐ కోర్సులు




**ఇబ్రహీంపట్నం, జనవరి 20 మహా:** మహిళా విద్యార్థినులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సర్టిఫికెట్ కోర్స్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రారంభం. ఇబ్రహీంపట్నంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నుండి ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ మీద సర్టిఫికెట్ కోర్సుని ప్రారంభిస్తున్నారు. ఈ ప్రోగ్రాం ఓరియంటేషన్ స్థానిక ప్రభుత్వ కళాశాలలో జరిగింది. ఈ సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాధిక మాట్లాడుతూ "నేటి ఆధునిక ప్రపంచంలో కృత్రిమ మేధస్సు (Artificial Intelligence AI) అనేది విప్లవాత్మక మార్పులు తీసుకువస్తున్న సాంకేతిక పరిజ్ఞానాలలో ఒకటి. డిగ్రీ స్థాయి విద్యార్థులు ఈ సాంకేతికతపై అవగాహన పెంపొందించుకోవడం చాలా అవసరం, ఎందుకంటే ఇది వారి భవిష్యత్తు ఉద్యోగ అవకాశాలను నిర్ణయించగల అత్యంత కీలక రంగాలలో ఒకటిగా మారింది కావున ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకుని శిక్షణ కార్యక్రమానికి హాజరు కావాలని సూచించారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సురేష్ మాట్లాడుతూ "ఈ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ సర్టిఫికెట్ కోర్సు ప్రధానంగా డేటా విశ్లేషణ, ఆటోమేషన్, అభ్యాస సామర్థ్యం, మరియు పైథాన్ వంటి వాటిపై పూర్తి స్థాయి అవగాహన కలిగేలా చేస్తుంది కాబట్టి ప్రతి ఒక్కరూ కళాశాల విద్య కమిషనర్ కల్పించిన ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని విద్యార్థులకు సూచించారు.

# తిరుమల శ్రీవారికి చెన్నై భక్తుడి భారీ విరాళం

**ఎస్వీబీసీ ఛానల్‌కు రూ. 5 కోట్లు.. గో సంరక్షణకు కోటి చెన్నై భక్తుడి కానుక**



**తిరుమల, మహా :** తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు నిత్యం ఎంతో మంది భక్తులు తిరుమల కొండకు వస్తుంటారు. స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటూ ఉంటారు. ఇలా దర్శించుకునే వారిలో కొంతమంది భక్తులు టీటీడీకి విరాళాలు సమర్పించడం తెలిసిన విషయమే. టీటీడీ ఆధ్వర్యంలో నడిచే ట్రస్టులకు, అన్నప్రసాదం ట్రస్టుకు విరాళాలు అందిస్తూ తమ వంతు సాయం చేస్తుంటారు. ఈ క్రమంలోనే టీటీడీకి మరో భారీ విరాళం అందింది. చెన్నైకు చెందిన ఓ భక్తుడు టీటీడీకి రూ. 6 కోట్లు విరాళంగా అందించారు. చెన్నైకి చెందిన వర్ధమాన్ జైన్ అనే భక్తుడు ఆదివారం టీటీడీ ట్రస్టులకు రూ.6 కోట్లు విరాళంగా అందజేశారు. టీటీడీ ఆధ్వర్యంలో నడిచే ఎస్వీబీసీ ఛానెల్ కోసం ఐదు కోట్ల రూపాయలు, ఎస్వీ గోసంరక్షణ ట్రస్టుకు వర్ధమాన్ జైన్ రూ. కోటి రూపాయలు విరాళంగా అందించారు. ఈ మేరకు తిరుమల శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి వర్ధమాన్ జైన్ విరాళానికి సంబంధించిన డీడీలను అందజేశారు. వర్ధమాన్ జైన్ టీటీడీకి విరాళం అందించడం ఇదే తొలిసారి కాదు. గతంలోనూ ఈయన విరాళాలు అందించినట్లు టీటీడీ ఓ ప్రకటనలో తెలిపింది. మరోవైపు జనవరి 29 నుంచి కడప జిల్లాలోని దేవుని కడప లక్ష్మీ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. జనవరి 29 నుండి ఫిబ్రవరి 6 వరకు దేవుని గడప లక్ష్మీ వెంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఈ వార్షిక బ్రహ్మోత్సవాలకు టీటీడీ ఏర్పాట్లు చేస్తోంది. బ్రహ్మోత్సవాలకు జనవరి 28వ తేదీ సాయంత్రం అంకురార్పణ చేయనున్నారు. జనవరి 29వ తేదీ ఉదయం ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభవుతాయి. ఫిబ్రవరి 3వ తేదీ ఉదయం స్వామివారి కల్యాణోత్సవం జరుగనుంది. ఇందులో పాల్గొనాలనుకునే భక్తులు రూ.300 చెల్లించి పాల్గొనవచ్చని టీటీడీ తెలిపింది. అలాగే ఫిబ్రవరి 7వ తేదీ పుష్పయాగం జరుగుతుందని.. భక్తులు పుష్పాలను సమర్పించవచ్చని ఓ ప్రకటనలో తెలిపింది.

# కక్ష సాధింపు రాజకీయాలు చేస్తే అధికారం కోల్పోయాక బాధపడాల్సి వస్తుంది: జగ్గారెడ్డి హెచ్చరిక



**హైదరాబాద్, మహా:** కక్షసాధింపు రాజకీయాల'పై కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత జగ్గారెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కక్ష సాధింపు రాజకీయాలకు తాను వ్యతిరేకమన్నారు. కక్ష సాధింపు రాజకీయాలు ఏ పార్టీకి లేదా ఏ ప్రభుత్వానికి మంచిది కాదన్నారు. అలాంటి రాజకీయాలు చేసేవాళ్లు అధికారం కోల్పోయాక బాధపడాల్సి వస్తుందని హెచ్చరించారు. దివంగత వైఎస్ రాజశేఖర రెడ్డి, కొణిజేటి రోశయ్య వంటి నేతలు ఎప్పుడూ కక్ష సాధింపు రాజకీయాలకు పాల్పడలేదన్నారు. తనకు ఎవరైనా నష్టం చేసినా... తాను మాత్రం ఎవరికీ నష్టం చేయలేదన్నారు. రాజకీయ యుద్ధం మాత్రం చేస్తామన్నారు. ఏ రాజకీయ పార్టీ అయినా, నాయకుడైనా డబ్బులు తీసుకోకుండా రాజకీయం చేస్తున్నట్లుగా ఎవరైనా అంగీకరిస్తారా? అని ప్రశ్నించారు. తనతో సహా డబ్బులు ముట్టకుండా రాజకీయం చేసిన నాయకులు ఎవరూ లేరన్నారు.




# అమ్మకాల ఒత్తిడిలోనే.. స్టాక్ మార్కెట్లను వీడని నష్టాలు

దేశీయ స్టాక్ మార్కెట్లను నష్టాలు వీడటం లేదు. ఈ ఏడాది మొదలు సూచీలు ఒడిదొడుకుల్లోనే కదులుతున్నాయి. మెజారిటీ మదుపరులు లాభాల స్వీకరణకే పెద్దపీట వేస్తున్నారు. ఈ క్రమంలోనే అంతకుముందు వారం ముగింపుతో చూస్తే గత వారం బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 759.58 పాయింట్లు లేదా 0.98 శాతం పడిపోయి 76,619.33 వద్ద ముగిసింది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 228.30 పాయింట్లు లేదా 0.97 శాతం కోల్పోయి 23,203.20 దగ్గర నిలిచింది. అంతకుముందు వారంలోనైతే ఈ నష్టాలు ఇంకా ఎక్కువగానే నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో ఈ వారం కూడా ట్రేడింగ్‌లో ఒడిదొడుకులకు ఆస్కారముందని, ముఖ్యంగా అమ్మకాల ఒత్తిడిలోనే ఇన్వెస్టర్లుంటారని మెజారిటీ నిపుణులు అంచనా వేస్తున్నారు. కానీ ఈ ఆర్థిక సంవత్సరం (202425) మూడో త్రైమాసికానికి (అక్టోబర్‌డిసెంబర్)గాను ఆయా సంస్థలు ప్రకటించే ఆర్థిక ఫలితాల ప్రభావం కూడా ట్రేడింగ్ సరళిని నిర్దేశించవచ్చన్న అభిప్రాయాలూ వినిపిస్తున్నాయి.

ఇక డాలర్‌తో పోల్చితే దారుణంగా దిగజారుతున్న రూపాయి మారకం విలువ.. మార్కెట్ నష్టాలను పెంచుతున్నది. మరోవైపు గ్లోబల్ స్టాక్ మార్కెట్ల తీరుతెన్నులు, విదేశీ మదుపరుల పెట్టుబడులు, ముడి చమురు ధరలు, అంతర్జాతీయ పరిణామాలూ ముఖ్యమేనని చెప్పవచ్చు. కాగా, అమ్మకాల ఒత్తిడి కనిపిస్తే నిఫ్టీకి 22,900 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 22,700 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం నిఫ్టీ 23,50023,700 స్థాయికి వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.

**గమనిక..**

**స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. వివిధ దేశ, విదేశీ పరిణామాలు ట్రేడింగ్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తుంటాయి. కాబట్టి ఇక్కడ ఒడిదొడుకులు చాలా సహజం. పెట్టుబడులు పెట్టే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం, ఆయా సాధనాల డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం ఉత్తమం. అలాగే పైన పేర్కొన్న సూచనలు విశ్లేషకుల అభిప్రాయం మాత్రమే. దీనికి మా పత్రిక ఎటువంటి బాధ్యత వహించదు. ఎవరి పెట్టుబడులకు వారిదే పూర్తి బాధ్యత. అవగాహన కోసమే ఈ మార్కెట్ పల్స్.**

# ఈ క్రెడిట్ కార్డులతో అప్పు ఎంతైనా తీసుకోవచ్చు.. కానీ!

అందరికీ ఇప్పుడు క్రెడిట్ స్కోర్, క్రెడిట్ హిస్టరీలు కీలకమైపోయాయి. పర్సనల్ బ్యాంకింగ్ రంగంలో ప్రస్తుతం ఈ రెండింటి ఆధారంగానే మెజారిటీ లావాదేవీలు జరుగుతున్నాయంటే అర్థం చేసుకోవచ్చు వాటికున్న ప్రాధాన్యం ఏమిటన్నది? అయితే మీరెక్కడా ఇప్పటిదాకా రుణాలు తీసుకోకుంటే మీకు రుణ చరిత్రే (క్రెడిట్ హిస్టరీ) ఉండదు. రుణ ఎగవేతలున్నా క్రెడిట్ స్కోర్ బాగుండదు. అప్పుడు మీ లోన్ అప్లికేషన్లు, మీరు పెట్టుకున్న క్రెడిట్ కార్డ్ విజ్ఞప్తులు తప్పకుండా తిరస్కరణకు గురవుతాయి. మరి అలాంటప్పుడు ఏం చేయాలి?

**ఇదీ సంగతి..**

క్రెడిట్ స్కోర్, క్రెడిట్ హిస్టరీ బాగాలేని వారి ఆర్థిక అవసరాలకు సెక్యూర్డ్ క్రెడిట్ కార్డులు ఓ చక్కని పరిష్కార మార్గమని చెప్పవచ్చు. రుణ చరిత్ర, క్రెడిట్ స్కోర్లతో సంబంధం లేకుండా బ్యాంకులు ఈ సెక్యూర్డ్ క్రెడిట్ కార్డులను జారీ చేస్తాయి.


**సెక్యూర్డ్ క్రెడిట్ కార్డు అంటే?**

- సెక్యూర్డ్ క్రెడిట్ కార్డులను నగదు పూచీకత్తుపైనే జారీ చేస్తారన్నది గుర్తుంచుకోవాలి. సహజంగా క్రెడిట్ కార్డు బకాయిల చెల్లింపుల్లో ఎగవేతలకు ఆస్కారమున్నప్పుడు బ్యాంకర్లు తమ రక్షణార్థం వీటిని కస్టమర్లకు ఇస్తూంటారు. దీనివల్ల కస్టమర్లు క్రెడిట్ కార్డు బిల్లులను చెల్లించలేకపోయినా బ్యాంకులకు నష్టం వాటిల్లదు. కార్డు కోసం పూచీకత్తుగా పెట్టిన నగదును ఆ బకాయిల కింద జమ చేసుకునే వెసులుబాటు ఉండటమే కారణం. కాబట్టి ఇలాంటి కస్టమర్ల విషయంలో బ్యాంకులు సేఫ్ జోన్‌లో ఉన్నట్టే. ఇక కార్డు పరిమితి రూ.50,000 కావాలనుకుంటే, అంతే మొత్తాన్ని డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. రూ.3 లక్షలు లేదా రూ.5 లక్షలు కావాలన్నా.. అంతే మొత్తాలు డిపాజిట్ చేయాలి. ఒక్కమాటలో చెప్పాలంటే మీరు చేసే డిపాజిట్లనుబట్టే మీరు పొందే క్రెడిట్ కార్డుకున్న రుణ పరిమితులు ఆధారపడి ఉంటాయి.
- విద్యార్థులు, అప్పుడప్పుడే సంపాదనలోపడ్డవారికి ఈ సెక్యూర్డ్ క్రెడిట్ కార్డులను ఎక్కువగా బ్యాంకింగ్ సంస్థలు సూచిస్తాయి.
- తీవ్ర ఆర్థిక ఇబ్బందులను చవిచూసినవారు.. క్రెడిట్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నా వారి క్రెడిట్ స్కోర్ తక్కువగా ఉంటుంది గనుక ఇవే వస్తాయి.
- రుణ చరిత్రలేనివారికి ఈ కార్డుతో క్రెడిట్ స్కోర్ ఏర్పడుతుంది. సక్రమ లావాదేవీలతో క్రెడిట్ స్కోర్‌ను క్రమేణా పెంచుకోవచ్చు.
- ఈ సెక్యూర్డ్ క్రెడిట్ కార్డు.. రెగ్యులర్ క్రెడిట్ కార్డు మాదిరే ఉంటుంది. చెల్లింపులు, వడ్డీలు, జరిమానాల్లో ఏ తేడాలు ఉండవు.
- తొలుత తీసుకున్న సెక్యూర్డ్ క్రెడిట్ కార్డును క్రమశిక్షణతో వినియోగిస్తే క్రెడిట్ స్కోర్ పెరుగుతుంది. దాని ఆధారంగా బ్యాంకింగ్ నిబంధనలకు లోబడి అన్‌సెక్యూర్డ్ క్రెడిట్ కార్డులను పొందవచ్చు.




# లాభాల్లో ముగిసిన దేశీయ స్టాక్ మార్కెట్లు


## సెనెక్స్ 454 పాయింట్లు జంప్



దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్లలోని సానుకూల పవనాలతో మార్కెట్లు లాభపడ్డాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 76,978.53 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. ప్రారంభంలోనే సెన్సెక్స్ 300 పాయింట్లకుపైగా పెరిగింది. చివరి వరకు అదే ఊపును కొనసాగించాయి. ఇంట్రాడేలో 76,584.84 పాయింట్ల కనిష్ఠాన్ని తాకిన సెన్సెక్స్.. 77,318.94 పాయింట్ల గరిష్ఠానికి చేరింది. చివరకు 454.11 పాయింట్ల లాభంతో.. 77,073.44 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 141.55 పెరిగి.. 23,344.75 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో దాదాపు 2,399 షేర్లు లాభపడ్డాయి. మరో 1,492 షేర్లు నష్టపోయాయి. నిఫ్టీలో కోటక్ మహీంద్రా బ్యాంక్, విప్రో, బజాజ్ ఫైనాన్స్, ఎన్‌టీపీసీ, బజాజ్ ఫిన్‌సర్వ్ లాభపడ్డాయి. ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్, శ్రీరామ్ ఫైనాన్స్, ట్రెంట్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, అదానీ పోర్ట్స్ నష్టపోయాయి. ఆటో, ఎఫ్ఎంసీజీ మినహా ఇతర అన్ని సూచీలు బ్యాంక్, మీడియా, మెటల్, క్యాపిటల్ గూడ్స్, పీఎస్‌యూ, టెలికాం, పవర్, పీఎస్‌యూ బ్యాంక్ ఒకటి నుంచి రెండుశాతం వరకు పెరిగాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.66 శాతం పెరిగింది.

# ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వృద్ధిరేటులో కోత..

## ఏడు శాతానికే పరిమితం అంటున్న మూడీస్..!




ప్రముఖ రేటింగ్ సంస్థ మూడీ'స్ భారత్ వృద్ధిరేటు అంచనాలను తగ్గించేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (202425)లో వృద్ధిరేటు ఏడు శాతమేనని తేల్చేసింది. గత ఆర్థిక సంవత్సరం (202324) వృద్ధిరేటు 8.2శాతంతో పోలిస్తే తగ్గుముఖం పడుతుందని వ్యాఖ్యానించింది. జాతీయ, అంతర్జాతీయ ఆర్థిక ధోరణుల నేపథ్యంలో వృద్ధిరేటు అంచనాలు తగ్గిస్తున్నట్లు మూడీ'స్ పేర్కొంది. అలాగే, దేశ ఆర్థిక వ్యవస్థ వృద్ధిరేటు కొనసాగుతుందని వెల్లడించింది. 202324తో పోలిస్తే తలసరి ఆదాయం 10,233 డాలర్లతో 11 శాతం పెరిగింది. ఇంతకు ముందు ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఫిక్కీ) సైతం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం వృద్ధిరేటు 7 నుంచి 6.4 శాతానికి పరిమితం అవుతుందని అంచనా వేసిన సంగతి తెలిసిందే. 202324లో జీడీపీ 8.2 శాతంగా నిలిచింది. అంటే గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది వృద్ధిరేటు గణనీయంగా పతనమైంది. గత డిసెంబర్‌లో ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఏడీబీ) సైతం భారత్ వృద్ధిరేట్ అంచనాలను సవరించింది. 202324లో భారత్ వృద్ధిరేటు 6.5 శాతమేనని ఏడీబీ పేర్కొంది. పారిశ్రామిక వృద్ధి బలహీనం, ప్రభుత్వ వ్యయం తగ్గింపు దీనికి కారణం అని వెల్లడించింది. ఇండ్ల డిమాండ్‌పై కఠిన ద్రవ్య పరపతి విధానంతో 202526లో జీడీపీ 7.2 నుంచి ఏడు శాతానికి పరిమితం అవుతుందని తెలిపింది.







## కోల్‌కతా వైద్యురాలిపై హత్యాచారం కేసులో

# దోషికి జీవితఖైదు


దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఆర్‌జీకార్ వైద్య కళాశాల ట్రెయినీ డాక్టర్‌పై లైంగిక దాడి, హత్య కేసులో కోల్‌కతా కోర్టు తీర్పు వెలువరించింది. ఈ కేసులో అరెస్టయిన సంజయ్ రాయ్‌ను న్యాయస్థానం శనివారం దోషిగా తేల్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తాజాగా అతడికి కోల్‌కతాలోని సీల్దా కోర్టు శిక్ష ఖరారు చేసింది. దోషి సంజయ్ రాయ్‌కి జీవితఖైదు విధించింది. అతడికి రూ.50 వేలు జరిమానా కూడా విధించింది. అంతేకాదు బాధిత కుటుంబానికి రూ.17లక్షల పరిహారం ఇవ్వాలని పశ్చిమబెంగాల్ ప్రభుత్వాన్ని కోర్టు ఆదేశించింది. అయితే, కోర్టు తీర్పుపై బాధిత కుటుంబ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దోషికి మరణశిక్ష విధించాలంటూ వైద్యురాలి తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. కాగా, 2024 ఆగస్టు 9న కోల్‌కతాలోని ఆర్‌జీకార్ ఆసుపత్రిలో సెమినార్ రూమ్‌లో ఒంటరిగా నిద్రిస్తున్న జూనియర్ వైద్యురాలిపై హత్యాచారం జరిగిన విషయం తెలిసిందే. ఈ ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ ఘటనపై దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తం కాగా ఆర్‌జీకార్ దవాఖాన డాక్టర్లు, వైద్య విద్యార్థులు సుదీర్ఘకాలం ఆందోళనలు నిర్వహించారు. ఘటన అనంతరం ఆసుపత్రి ఆవరణలోని సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా సంజయ్‌ను ఆగస్టు 10న కోల్‌కతా పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం ఈ కేసును సీబీఐ విచారించింది. ప్రధాన నిందితుడిగా సంజయ్ రాయ్ పేరును ఛార్జ్‌షీట్‌లో చేర్చి కోర్టుకు సమర్పించింది. దీనిపై గత వారం విచారణ జరిపిన కోల్‌కతాలోని సీల్దా కోర్టు.. సంజయ్ రాయ్‌ని దోషిగా నిర్ధారించింది. ఈ మేరకు ఇవాళ దోషికి శిక్ష ఖరారు చేస్తూ తీర్పు వెలువరించింది.

## నేను నిర్దోషిని : సంజయ్ రాయ్

మరోవైపు కోర్టులో విచారణ సందర్భంగా సంజయ్ రాయ్ తాను నిర్దోషినని, ఈ కేసులో తనను ఇరికించారని చెప్పాడు. తనను ఈ కేసులో ఇరికించిన ఐపీఎస్ అధికారితోసహా అందరినీ ఎందుకు విడుదల చేశారని అతను ప్రశ్నించాడు. ఈ కేసులో సాక్ష్యాలను మార్చినందుకు ఆర్‌జీ కర్ మాజీ ప్రిన్సిపల్ సందీప్ ఘోష్‌తోపాటు స్థానిక పోలీసు స్టేషన్ మాజీ ఎస్‌హెచ్‌ఓకు బెయిల్ ఇవ్వడాన్ని రాయ్ ప్రశ్నించాడు. న్యాయమూర్తి తీర్పును ప్రకటించిన అనంతరం పోలీసులు దోషిని కోర్టు రూము నుంచి గట్టి బందోబస్తు మధ్య ప్రెసిడెన్సీ కరెక్షనల్ హోమ్‌కు తరలించారు. న్యాయమూర్తి తీర్పు విని బాధితురాలి తండ్రి భావోద్వేగానికి గురై విలపించారు. న్యాయవ్యవస్థపై తాము ఉంచుకున్న నమ్మకాన్ని న్యాయస్థానం నిలబెట్టుకుందని ఆయన తెలిపారు. తన చార్జిషీటులో నగర పోలీసు శాఖలో సివిక్ వాలంటీర్‌గా పనిచేస్తున్న సంజయ్ రాయ్‌ను ఈ కేసులో ప్రధాన, ఏకైక అనుమానితుడిగా దర్యాప్తు సంస్థ సీబీఐ పేర్కొంది. నిందితుడికి మరణ శిక్ష విధించాలని సీబీఐ న్యాయస్థానాన్ని కోరింది.

# ఇస్కాన్ ఏనుగులకు వంతారా చేయూత

**ముంబై:** అనంత్ అంబానీ ఔదర్యం ప్రదర్శించాడు. జంతు సంరక్షణ కేంద్రం వంతారాకు.. కొత్తగా రెండు ఏనుగుల్ని తీసుకురానున్నారు. కోల్‌కతా సమీపంలోని మాయాపూర్‌లో ఉన్న ఇస్కాన్‌లో రెండు ఏనుగులు ఉన్నాయి. 18 ఏళ్ల బిష్ణుప్రియ, 26 ఏళ్ల లక్ష్మీప్రియాలను.. ఇప్పుడు వంతారా జంతు సంరక్షణ కేంద్రానికి తీసుకున్నారు. ఇక నుంచి ఆ ఏనుగుల బాగోగులు అక్కడే చూసుకోనున్నారు. గత ఏప్రిల్‌లో మావోతుపై బిష్ణుప్రియా దాడి చేసింది. ఈ నేపథ్యంలో దాని సంరక్షణ చూసుకునేందుకు అనంత్ అంబానీ ముందుకు వచ్చారు. ప్రత్యేకమైన కేర్ అవసరమన్న విషయాన్ని ఆ సంఘటన చెబుతోందని వంతారా పేర్కొన్నది. ఏనుగులకు సహజసిద్ధమైన పరిస్థితుల్ని వంతారాలో కల్పించనున్నారు. వెటర్నరీ కేర్ తీసుకోనున్నారు. వంతారా కేంద్రంలో ఉన్న ఇతర ఏనుగులతో కలిసే విధంగా ఆ కొత్త ఏనుగుల్ని తీర్చుదిద్దుతారు. లక్ష్మీప్రియా, బిష్ణుప్రియా ఏనుగులు ఇస్కాన్‌లో జరిగే వేడుకలకు వాడుకుంఉటన్నారు. అయితే ఇటీవల ఓ ఏనుగు మావోతుపై అటాక్ చేసింది. ఈ నేపథ్యంలో వాటిని తరలిస్తున్నారు.





# కోర్టు తీర్పు పట్ల సంతృప్తి చెందలేదు

## సంజయ్‌కు జైలు శిక్షపై మమతా బెనర్జీ స్పందన

**కోల్‌కతా:** దేశవ్యాప్తంగా సంచలనం రేపిన కోల్‌కతాలోని ఆర్జీ కర్ హత్యాచారం కేసులో దోషి సంజయ్ రాయ్‌కు సీబీఐ కోర్టు జీవిత ఖైదు విధించింది. సీఎం మమతా బెనర్జీ దీనిపై స్పందించారు. సంజయ్ రాయ్‌కు కోర్టు విధించిన శిక్ష పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. సోమవారం మీడియాతో ఆమె మాట్లాడారు. 'నేను సంతృప్తి చెందలేదు. మనమంతా మరణశిక్షను డిమాండ్ చేశాం. కానీ కోర్టు మరణించే వరకు జీవిత ఖైదు విధించింది' అని అన్నారు. కాగా, గత ఏడాది ఆగస్ట్ 9న ఆర్జీ కర్ ఆసుపత్రిలో రాత్రి విధుల్లో ఉన్న జూనియర్ వైద్యురాలిపై జరిగిన హత్యాచారం కేసు దర్యాప్తును కోల్‌కతా పోలీసుల నుంచి బలవంతంగా తీసుకున్నారని మమతా బెనర్జీ ఆరోపించారు. ఒకవేళ కోల్‌కతా పోలీసులు ఈ కేసు దర్యాప్తును కొనసాగించి ఉంటే నిందితుడికి మరణశిక్ష నిర్ధారించేవారని అన్నారు. మరోవైపు సీబీఐ దర్యాప్తును మమతా బెనర్జీ ప్రశ్నించారు. వారు (సీబీఐ) దర్యాప్తు ఎలా నిర్వహించారో మాకు తెలియదు.





# కుమారుడు ఆత్మహత్య..

## తట్టుకోలేక గుండెపోటుతో తల్లి మృతి

**భోపాల్:** ఉద్యోగం రాలేదన్న మనస్తాపంతో ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయం తెలిసి అతడి తల్లి గుండెపోటుతో మరణించింది. తల్లి, కుమారుడు మరణించిన సమాచారం తెలుసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో ఈ సంఘటన జరిగింది. 33 ఏళ్ల మనీష్‌రాజ్‌పుత్ ప్రభుత్వ ఉద్యోగాల కోసం చాలా పరీక్షలు రాశాడు. ఏ ఉద్యోగం రాకపోవడంతో తీవ్ర మనస్తాపం చెందాడు. ఈ నేపథ్యంలో జనవరి 18న శనివారం రాత్రి వేళ ఇంట్లో విషం సేవించి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు మనీష్‌ను వెంటనే ఆసుపత్రికి తరలించారు. కాగా, మనీష్ చికిత్స పొందుతూ ఆదివారం మరణించాడు. అయితే కుమారుడి మరణవార్త తెలిసి అతడి తల్లి రాధా గుండెపోటుతో కుప్పకూలి చనిపోయింది. ఈ నేపథ్యంలో ఆ కుటుంబంలో విషాదం నెలకొన్నది. రాధా పెద్ద కుమారుడు అనిల్ ఈ విషయాన్ని పోలీసులకు తెలిపాడు. దీంతో వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# బైక్‌ను వెంబడించిన ఏనుగు.. తర్వాత ఏం జరిగిందంటే?

**తిరువనంతపురం:** కుటుంబంతో కలిసి బైక్‌పై వెళ్తున్న వ్యక్తికి ఒక పెద్ద ఏనుగు ఎదురుపడింది. దానిని చూసి అతడు ఆగాడు. ఆ ఏనుగు అతడికి దగ్గరగా వచ్చింది. దీంతో భయాందోళన చెందిన ఆ వ్యక్తి బైక్‌ను వేగంగా నడిపాడు. ఈ నేపథ్యంలో ఆ ఏనుగు ఆ బైక్‌ను వెంబడించింది. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. కేరళలోని వయనాడ్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ఆదివారం ఒక వ్యక్తి తన భార్య, బిడ్డతో కలిసి బైక్‌పై ప్రయాణించాడు. తిరునెల్లి అటవీ ప్రాంతంలో పెద్ద ఏనుగు వారికి ఎదురుగా వచ్చింది. దీనిని చూసి ఆ వ్యక్తిని బైక్‌ను నిలిపాడు. కాగా, ఏనుగు వారి దగ్గరకు వచ్చింది. ఇది చూసి ఆ వ్యక్తి భయంతో బైక్‌ను వేగంగా నడిపాడు. దీంతో ఏనుగు ఆ బైక్‌ను వెంబడించింది. అయితే ఆ బైక్‌పై ఉన్న వారు ఆ ఏనుగు దాడి నుంచి తృటిలో తప్పించుకున్నారు. మరోవైపు అదే మార్గంలో వెళ్తున్న కారులోని వ్యక్తులు దీనిని చూశారు. ఏనుగు బైకర్‌ను వెంబడించడం చూసి తమ వాహనాన్ని వెనక్కి మళ్లించారు. ఆ కారులోని వ్యక్తి రికార్డ్ చేసిన ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.



మహా పత్రిక
WWW.MAHAADAILY.COM | సినిమా వార్తలు | MOVIE NEWS | మంగళవారం, హైదరాబాద్ | 21-01-2025
ANN తెలుగు

## ట్విస్ట్‌తో మోహన్ లాల్ బరోజ్ ఓటీటీ ప్రీమియర్ డేట్ టాక్..



మలయాళ స్టార్ హీరో మోహన్‌లాల్ బ్యాక్ టు బ్యాక్ సినిమాలను లైన్‌లో పెట్టాడని తెలిసిందే. ఈ స్టార్ యాక్టర్ స్వీయదర్శకత్వంలో నటించిన మలయాళ ఫాంటసీ సినిమా బరోజ్. క్రిస్మస్ కానుకగా ప్రపంచ వ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదలై.. మిక్స్‌డ్ రెస్పాన్స్ రాబట్టుకుంది. ఇక ఈ చిత్రం ఓటీటీలో తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు రెడీ అయింది. బరోజ్ డిస్నీ ప్లస్ హాట్ స్టార్‌లో ప్రీమియర్ కానుంది. బరోజ్ జనవరి 22 నుంచి మలయాళం, తెలుగు, తమిళం, తెలుగు, కన్నడ భాషల్లో అందుబాటులో ఉండనుందని డిస్నీ ప్లస్ హాట్ స్టార్ ప్రకటించింది. అయితే ట్విస్ట్‌తో బరోజ్ ప్రీమియర్ కానుంది. హిందీ వెర్షన్‌ను మాత్రం తర్వాత విడుదల చేయనున్నట్టు తెలిపింది. బరోజ్ థియేటర్లలో త్రీడీ వెర్షన్‌లో విడుదల కాగా.. ఓటీటీలో 2డీ వెర్షన్ అందుబాటులో ఉండనుంది. బరోజ్ : గార్డియన్ ఆఫ్ డిగామాస్ ట్రెజర్ నవల ఆధారంగా తెరకెక్కిన ఈ మూవీకి జిజో పున్నూస్ కథ, స్క్రీన్ ప్లే సమకూర్చాడు. ఈ చిత్రాన్ని ఆశీర్వాద్ సినిమాస్ బ్యానర్‌పై ఆంటోనీ పెరంబవూరు తెరకెక్కించారు. ఆ డిగామా బంగ్లా లోపల ఎవరికీ కనిపించని భూతం ఉందంటూ ఓ చిన్నారి వాయిస్ ఓవర్‌తో మొదలైన ట్రైలర్‌లో వందల సంవత్సరాలుగా నిధులు కాపాడుకుంటూ వస్తోన్న భూతం. మిగితా వారి కోసం కార్చే కన్నీరు కంటే మహత్తరమైన నిధి ఈ లోకంలో మరేది లేదంటూ సినిమాపై క్యూరియాసిటీ పెంచేశాడు మోహన్ లాల్. మరి బరోజ్‌కు ఓటీటీలో ఎలాంటి స్పందన వస్తుందో చూడాలి.

## పరమేశ్వరుడిగా అక్షయ్ కుమార్.. కన్నప్ప


ఫ్యామిలీ గొడవలతో సతమవుతున్న మంచు ఫ్యామిలీ.. మరోవైపు తమ కలల ప్రాజెక్ట్ కన్నప్పను పూర్తి చేసే పనిలో పడింది. మంచు కుటుంబం నుంచి వస్తున్న మోస్ట్ ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్ కన్నప్ప. దాదాపు రూ.100 కోట్ల బడ్జెట్‌తో వస్తున్న ఈ సినిమాను కలెక్షన్ కింగ్ మంచు మోహన్ బాబు నిర్మిస్తుండగా.. మంచు విష్ణు కథానాయకుడిగా నటిస్తున్నాడు. హిస్టారికల్ కం మైథాలజీ బ్యాక్‌డ్రాప్‌లో వస్తున్న ఈ చిత్రంలో ప్రభాస్‌తో పాటు బాలీవుడ్, కోలీవుడ్ అగ్ర తారలు నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ చిత్రానికి మహాభారతం సీరియల్ ఫేమ్ ముఖేష్‌కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఇప్పటికే ఈ మూవీ నుంచి మంచు మోహన్ బాబు, మంచు విష్ణులతో పాటు పలువురు అగ్ర కథానాయకుల ఫస్ట్ లుక్‌లను పంచుకున్న చిత్రబృందం తాజాగా ఈ సినిమా నుంచి బాలీవుడ్ నటుడు అక్షయ్ కుమార్ ఫస్ట్ లుక్‌ని విడుదల చేసింది. ఈ సినిమాలో అక్షయ్ కుమార్ పరమేశ్వరుడి పాత్రలో కనిపించబోతున్నట్లు ప్రకటించింది. ముల్లోకాలు ఏలే పరమేశ్వరుడు భక్తికి మాత్రం దాసుడు అంటూ అక్షయ్ శివుడి రూపంలో ఉన్న అక్షయ్ ఫస్ట్ లుక్‌ని పంచుకుంది.




## అమితాబ్ బచ్చన్ బిజినెస్ ప్లాన్ అదిరింది

### అపార్ట్‌మెంట్‌ను ఎంత లాభానికి అమ్మాడో తెలుసా..?

బాలీవుడ్ స్టార్ యాక్టర్ అమితాబ్ బచ్చన్ ఓ వైపు సినిమాలు చేస్తూనే.. మరోవైపు బిజినెస్‌లో కూడా తనదైన స్ట్రాటజీతో ముందుకెళ్తూ టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలుస్తుంటారని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. తాజాగా తన అపార్ట్‌మెంట్‌ను భారీ మొత్తానికి అమ్మి మంచి లాభాలు గడించి వార్తల్లో నిలిచాడు బిగ్ బీ. బిగ్ బీ గత జనవరిలో ముంబైలోని ఓషివారా ప్రాంతంలోని తన అపార్ట్‌మెంట్‌ను విక్రయించగా.. తన పెట్టుబడిలో భారీగా అప్రిషియేషన్ పొందారు. అమితాబ్ బచ్చన్ 2021లో ఈ డూప్లెక్స్ అపార్ట్‌మెంట్‌ను రూ.31 కోట్లకు కొనుగోలు చేసి.. ఇప్పుడు దాన్ని రూ.83 కోట్లకు విక్రయించాడు. ముంబైలోని రియల్ ఎస్టేట్ కన్సల్టెన్సీ సంస్థ స్క్వేర్ యార్డ్స్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ రిజిస్ట్రేషన్ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ పత్రాలతో సహా ఈ వివరాలను పొందుపరిచింది. ఓషివారా పశ్చిమ ముంబై సమీపంలోని లోఖండ్‌వాలా కాంప్లెక్స్‌లొకేషన్‌లో ఈ అపార్ట్‌మెంట్ ఉంది. ది అట్లాంటిస్ ఏరియాలో క్రిస్టల్ గ్రూప్ అభివృద్ధి చేసిన ఈ రెసిడెన్షియల్ ప్రాజెక్ట్‌లో 4,5,6 బీహెచ్‌కే అపార్ట్‌మెంట్స్ ఉన్నాయి. ఐజీఆర్ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్స్ ప్రకారం ఈ డూప్లెక్స్ అపార్ట్‌మెంట్‌ను 5,704 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించారు. ఇందులో 5,185.62 చదరపు అడుగులు కార్పెట్ ఏరియా, ఆరు కారు పార్కింగ్ స్థలాన్ని కలిగి ఉంది. ఈ అపార్ట్‌మెంట్ లావాదేవీలకు స్టాంప్ డ్యూటీ పేమెంట్ రూ.4.98 కోట్లుకాగా.. రిజిస్ట్రేషన్ ఛార్జీలు రూ.30 వేలుగా పేర్కొన్నారు. డాక్యుమెంట్స్ ప్రకారం బిగ్ బీ ఈ అపార్ట్‌మెంట్‌ను 2021 ఏప్రిల్‌లో రూ.31 కోట్లకు కొనుగోలు చేయగా.. ప్రస్తుతం రూ.83 కోట్లకు అమ్మారు. అంటే రూ.52 కోట్లు లాభం అన్నమాట. ఇది విలువపరంగా 168 శాతం గణనీయంగా పెరిగింది. బిగ్ బీ ఈ అపార్ట్‌మెంట్‌ను నటి కృతిసనన్‌కు నవంబర్ 2021లో అద్దెకు కూడా ఇచ్చాడని తెలిసిందే.





## చిక్కుల్లో రిషబ్ షెట్టి కాంతార టీమ్.. కేసు నమోదు!

రిషబ్ షెట్టి నటించిన బ్లాక్ బస్టర్ చిత్రం 'కాంతార'చిత్రం చిక్కుల్లో చిక్కుకుంది. ఈ సినిమాకు ప్రీక్వెల్ వస్తున్న విషయం తెలిసిందే. కాంతారకు ముందు ఏం జరిగిందనే కథాశంతో ఈ సినిమా రాబోతుంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతుండగా.. కర్ణాటకలోని అటవీ ప్రాంతాల్లో ఈ సినిమాను షూట్ చేస్తున్నారు. అయితే అడవిలో షూటింగ్ చేయడం వలన అటవీ ప్రాంతం నాశనం అవుతుందని స్థానికులు ఫిర్యాదు చేశారు. ఈ మూవీ షూటింగ్‌కి గ్రామ శివార్లలోని ఖాళీ మైదానాల్లో ప్రభుత్వం అనుమతినివ్వగా.. చిత్రబృందం మాత్రం అక్రమంగా అడవిలోకి వెళ్లి షూట్ చేస్తుందని తెలిపారు. అంతేగాకుండా.. ఈ సినిమా షూటింగ్ కోసం పేలుడు పదార్థాలు ఉపయోగిస్తున్నారని దీనివలన అడవిలో ఉన్న పక్షులతో పాటు మూగజీవాలు భయాందోళనకి గురవతున్నట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. అలాగే ఈ షూటింగ్ వలన పర్యావరణానికి తీవ్ర నష్టం జరుగుతుందని తెలిపారు. అయితే ఈ విషయంలోనే గ్రామస్థులకు చిత్రబృందంకి గొడవ జరుగుగా.. గ్రామానికి చెందిన ఓ యువకుడిపై చిత్ర బృందం దాడి చేసిందని తెలిపారు. దీంతో స్థానిక గ్రామస్థులంతా యెసలూరు పోలీస్ స్టేషన్‌లో కాంతార చిత్రబృందంపై కేసు నమోదు చేశారు.

### మరో భాషలో నాగచైతన్య-సాయిపల్లవి తండేల్..

## ఇక నిర్మాతలకు కాసులే..!



టాలీవుడ్ యాక్టర్ అక్కినేని నాగచైతన్యసాయిపల్లవి కాంబోలో సినిమా వస్తుందంటే క్రేజ్ ఎలా ఉంటుందో తెలిసిందే. ఇప్పటికే లవ్ స్టోరీతో బాక్సాఫీస్‌ను షేక్ చేసిన ఈ స్టార్ యాక్టర్లు ప్రస్తుతం తండేల్‌లో నటిస్తున్నారు. రొమాంటిక్ డ్రామా నేపథ్యంలో వస్తోన్న ఈ చిత్రం చందూ మొండేటి డైరెక్షన్‌లో తెరకెక్కుతోంది. ఈ చిత్రాన్ని ఫిబ్రవరి 7న ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేస్తున్నట్టు మేకర్స్ ఇప్పటికే ప్రకటించారు. ఈ మూవీ తెలుగు, తమిళం, హిందీ భాషల్లో విడుదల కానుంది. అయితే తాజాగా మరో క్రేజీ నిర్ణయాన్ని తీసుకున్నారన్న వార్త ఒకటి నెట్టింట హల్‌చల్ చేస్తోంది. తండేల్ మలయాళం వెర్షన్‌ను రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తుండగా.. త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన కూడా ఉండబోతుందట. సాయిపల్లవికి మలయాళంలో సూపర్ క్రేజ్ ఉంటుందని తెలిసిందే. ఒకవేళ ఇదే నిజమైతే తండేల్ సినిమాకు మాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద వసూళ్లు పెరుగుతాయనడంలో ఎలాంటి సందేహం లేదు. తండేల్ నుంచి ఇప్పటికే లాంచ్ చేసిన బుజ్జి తల్లి సాంగ్‌కు మంచి స్పందన వస్తోంది. 2018లో గుజరాత్ జరిగిన వాస్తవ ఘటనల ఆధారంగా వస్తోన్న తండేల్ చిత్రాన్ని గీతాఆర్ట్స్‌పై అల్లు అరవింద్ సమర్పణలో బన్నీవాసు నిర్మిస్తున్నారు. ఈ మూవీకి అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. తండేల్ నాగచైతన్యచందూ మొండేటి కాంబోలో రాబోతున్న మూడో సినిమా కావడంతో ఈ ప్రాజెక్టుపై అంచనాలు భారీగానే ఉన్నాయి.

# క్రీడా వార్తలు | SPORTS NEWS

## చాలా బాధపడ్డాను.. నిరాశ చెందాను..!

### ఐపీఎల్‌కు దూరమవడంపై ఉమేష్ యాదవ్ వ్యాఖ్యలు..



ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2025 ఎడిషన్‌కు సంబంధించిన మెగా వేలం నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ వేలంలో ఆటగాళ్ల కోసం ఫ్రాంచైజీలు పోటీపడి మరీ కోట్లాది రూపాయలు ఖర్చు చేశాయి. అయితే, టీమిండియా ఫాస్ట్ బౌలర్ ఉమేష్ యాదవ్‌ను కొనుగోలు చేసేందుకు మాత్రం ఆసక్తి చూపలేదు. ఈ క్రమంలో సీనియర్ ఆవేదన వ్యక్తం చేశాడు. వేలంలో ఫ్రాంచైజీలు కొనుగోలు చేయకపోవడంతో తాను చాలా బాధపడ్డానని.. నిరాశ చెందానని ఉమేష్ పేర్కొన్నాడు. ఉమేష్ ఐపీఎల్‌లో ఇప్పటి వరకు నాలుగు జట్ల తరఫున బరిలోకి దిగాడు. ఢిల్లీ క్యాపిటల్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూరు. కోల్‌కతా నైట్ రైడర్జ్, గుజరాత్ టైటన్స్ తరఫున ప్రాతినిథ్యం వహించిన విషయం తెలిసిందే. అయితే, స్పోర్ట్స్ ఛానెల్‌తో ఉమేశ్ మాట్లాడుతూ ఐపీఎల్‌లో తాను 15 సంవత్సరాలుగా ఆడుతున్నానని తెలిపాడు. ఈ ఐపీఎల్ తనకు చాలా షాకింగ్ ఉందని చెప్పాడు. తాను ఎందుకు అబద్ధం చెప్పాలని.. ఈ విషయంలో తనకు బాధగా ఉందని పేర్కొన్నాడు. దాదాపు 150 ఐపీఎల్ మ్యాచులు ఆడిన తర్వాత జట్టులో స్థానం లభించకపోతే ఏ ఆటగాడికైనా షాకింగ్‌గా ఉంటుందని చెప్పాడు. అయితే, అది ఫ్రాంచైజీ, వారి వ్యూహాలపై ఆధారపడి ఉంటుందన్న ఉమేష్.. వేలంలో తన పేరు ఆలస్యంగా రావడం.. డబ్బు లేకపోవడం వల్ల ఏదో విధంగా తాను ఐపీఎల్‌కు దూరమయ్యాయని చెప్పాడు. తాను చాలా నిరాశ, కలత చెందానన్న ఉమేష్.. ఎవరి నిర్ణయాన్ని మార్చలేనని వాపోయాడు. ఉమేష్ యాదవ్ ఐపీఎల్‌లో గత 15 సీజన్స్‌లో పాల్గొన్నాడు. ఇందులో 148 మ్యాచులు ఆడిన ఫాస్ట్ బౌలర్ 144 వికెట్లు పడగొట్టాడు. ఇక రిటైర్మెంట్‌పై స్పందిస్తూ.. తాను 140 కిలోమీటర్ల వేగంతో బౌలింగ్ చేయలేనప్పుడు రిటైర్ అవుతానని ప్రకటించాడు. అప్పటి వరకు బౌలింగ్ చేస్తుంటానని.. ఈ విషయం ఎవరికీ చెప్పాల్సిన అవసరం లేదని తెలిపాడు. ఉమేష్ టీమిండియా తరఫున 57 టెస్టులు, 75 వన్డేలు, 9 టీ20 ఆడాడు. టెస్టుల్లో 170 వికెట్లు, వన్డేల్లో 106, టీ20ల్లో 12 వికెట్లు తీశాడు. ఇక ఉమేష్ యాదవ్ జూన్ 2023లో ఆస్ట్రేలియాతో జరిగిన ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్‌లో టీమిండియా తరఫున చివరి మ్యాచ్ ఆడాడు.



## లక్నో సూపర్ జెయింట్స్ కెప్టెన్‌గా రిషబ్ పంత్..

### ప్రకటించిన సంజీవ్ గొయెంకా


ఐపీఎల్‌లో లక్నో సూపర్ జెయింట్స్ కెప్టెన్‌గా భారత జట్టు స్టార్ వికెట్ కీపర్, బ్యాట్స్‌మెన్ రిషబ్ పంత్ నియామకమయ్యాడు. ఈ విషయాన్ని ఫ్రాంచైజీ ఓనర్ సంజీవ్ గొయెంకా వెల్లడించారు. రాబోయే ఐపీఎల్‌లో పంత్ అంత్య విజయవంతమైన కెప్టెన్‌గా నిలుస్తాడని ఆశాభావం వ్యక్తం చేశారు గొయెంకా. ఇటీవల జెడ్డా వేదికగా జరిగిన ఐపీఎల్ మెగా వేలంలో లక్నో జట్టు రూ.27కోట్లు పోసి కొనుగోలు చేసిన విషయం తెలిసిందే. ఐపీఎల్2025 సీజన్ ఈ ఏడాది మార్చి చివరి వారంలో మొదలుకానున్నది. ఈ సీజన్‌కు రిషబ్ పంత్‌ను జట్టు యాజమాన్యం నియమించింది. గత సీజన్ వరకు లక్నో జట్టు కెప్టెన్‌గా కేఎల్ రాహుల్ కొనసాగాడు. లక్నో కేఎల్ రాహుల్‌ను రిటైన్ చేసుకునేందుకు ఆసక్తి చూపలేదు. ఇక రిషబ్ పంత్ గతంలో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టులో కొనసాగిన విషయం తెలిసిందే. రిషబ్ పంత్ ఢిల్లీకి 2016 నుంచి ప్రాతినిథ్యం వహిస్తూ వచ్చాడు. 110 మ్యాచ్‌ల్లో 35.31 సగటుతో 3,284 పరుగులు చేశాడు. ఇందులో ఒక సెంచరీ, 18 అర్ధ సెంచరీలు ఉన్నాయి. పంత్ 2021లో ఢిల్లీ జట్టుకు కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. అదే సీజన్‌లో జట్టును ప్లేఆఫ్ వరకు చేర్చాడు. IPL 2025 సీజన్ కోసం మెగా వేలానికి ముందు, లక్నో నికోలస్ పూరన్, మయాంక్ యాదవ్, రవి బిష్ణోయ్, మొహ్సిన్ ఖాన్, ఆయుష్ బదోనిని రీటెన్ చేసుకుంది.

## ఎంపీ ప్రియా సరోజ్‌ను పెళ్లి చేసుకోనున్న క్రికెటర్ రింకూ సింగ్..

### ధ్రువీకరించిన ప్రియ తండ్రి



**జౌనపుర్:** టీ20 స్పెషలిస్టు హిట్టర్, క్రికెటర్ రింకూ సింగ్ .. సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ ప్రియా సరోజ్)ను పెళ్లి చేసుకోనున్నాడు. ఈ ఇద్దరి మధ్య రిలేషన్ ఉన్నట్లు ఇటీవల వార్తలు గుప్పుమన్న విషయం తెలిసిందే. అయితే రింకూ, ప్రియా మ్యారేజ్ గురించి ఇప్పుడు క్లారిటీ వచ్చేసింది. ప్రియా సరోజ్ తండ్రి, ప్రస్తుతం కేరాకట్ నియోజకవర్గ ఎమ్మెల్యే అయిన తుఫానీ సరోజ్ ఆ డౌట్స్ క్లియర్ చేశాడు. రింకూ సింగ్ కుటుంబసభ్యులతో ప్రియా పెళ్లి గురించి మాట్లాడినట్లు తుఫానీ సరోజ్ తెలిపారు. ఓ వార్తా సంస్థతో ఈ విషయాన్ని ఆయన వెల్లడించాడు. రింకూ, ప్రియా పెళ్లి గురించి అలీఘడ్‌లో రెండు కుటుంబాల మధ్య అర్థవంతమైన చర్చలు జరిగినట్లు చెప్పారు. ఇరు కుటుంబాలు పెళ్లికి అంగీకరించినట్లు తుఫానీ సరోజ్ తెలిపారు. ఇప్పటి వరకు రింకూ, ప్రియా మధ్య ఉంగరాలు మార్చుకోవడం కానీ, ప్రీవెడ్డింగ్ సెర్మనీ జరగలేదన్నారు. ప్రియా స్నేహితురాలి తండ్రి ఓ క్రికెటర్ అని, ఆయన ద్వారా రింకూతో ప్రియాకు పరిచయం ఏర్పడినట్లు తెలిసిందన్నారు. అయితే ఏడాది నుంచి ప్రియా, రింకూ మధ్య స్నేహం ఉన్నట్లు చెప్పారు. ఇద్దరూ ఒకర్ని ఒకరు ఇష్టపడ్డారని, అయితే కుటుంబ పెద్దల దీవెన కోసం ఎదురుచూవారని, ఈ పెళ్లి కోసం ఇరు కుటుంబాలు అంగీకరించినట్లు తుఫానీ సరోజ్ తెలిపారు.



## నీరజ్ చోప్రా పెళ్లాడిన హిమానీ మోర్ ఎవరు..

## ఆమె ప్రత్యేకతలేంటో తెలుసా?

**న్యూఢిల్లీ:** ఒలింపిక్ మెడలిస్టు, జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా.. ఆదివారం పెళ్లి చేసుకున్నాడు. హిమానీ మోర్ అనే అమ్మాయిని అతను పెళ్లాడాడు. హిమాచల్ ప్రదేశ్‌లో చాలా సాదాసీదాగా కేవలం 50 మంది అతిథుల సమక్షంలో నిరాడంబరంగా పెళ్లి వేడుక నిర్వహించారు. తన సోషల్ మీడియా అకౌంట్ ద్వారా ఒలింపిక్ స్టార్ నీరజ్ తన మ్యారేజ్ విషయాన్ని చెప్పాడు. పెళ్లి పీటలపై కూర్చున్న ఫోటోను పోస్టు చేసి అందర్నీ స్టన్ చేశాడు. నీరజ్ చోప్రా భార్య పేరు హిమానీ మోర్. ఆమె గురించి కొన్ని విషయాలు తెలుసుకుందాం. హిమానీ మోర్ వయసు 25 ఏళ్లు. ఆమె టెన్నిస్ క్రీడాకారిణి. సోనిపట్ ఆమె సొంతూరు. అక్కడ లిటిల్ ఏంజిల్స్ స్కూల్‌లో ఆమె చదువుకున్నది. ప్రస్తుతం హిమానీ మోర్.. న్యూ హాంప్‌షైర్‌లోని ఫ్రాంక్లిన్ పియర్స్ యూనివర్సిటీలో స్పోర్ట్స్ మేనేజ్మెంట్‌లో మాస్టర్స్ డిగ్రీ చేస్తున్నది. ఢిల్లీలోని మిరండా హౌజ్ అల్యూమినిలో ఉన్నది. పొలిటికల్ సైన్స్, ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో ఆమె బ్యాచిలర్స్ డిగ్రీ పూర్తి చేసింది. ఆమెకు ఓ సోదరుడు ఉన్నాడు. అతని పేరు హిమాన్షు. అతను కూడా టెన్నిస్ ప్లేయరే. ఢిల్లీ యూనివర్సిటీ నుంచి గతంలో జాతీయ స్థాయిలో ఆమె పోటీపడింది. 2017లో తైపయిలో జరిగిన వరల్డ్ యూనివర్సిటీ గేమ్స్‌లోనూ పార్టిసిపేట్ చేసింది. 2016లో మలేషియాలో జరిగిన వరల్డ్ జూనియర్ టెన్నిస్ చాంపియన్‌షిప్‌లో ఆమె గోల్డ్ మెడల్ గెలిచినట్లు స్కూల్ వెబ్‌సైట్‌లో ఉంది. సోనిపట్‌కు చెందిన అమ్మాయి.. అమెరికాలో చదువుతున్నదని, రెండు రోజుల క్రితం ఆ ఇద్దరు పెళ్లి చేసుకున్నారని, ప్రస్తుతం హనీమూన్ కోసం ఆ ఇద్దరూ దేశం విడిచి వెళ్లారని, వాళ్లు వెళ్లిన ప్రదేశం గురించి తెలియదని నీరజ్ చోప్రా సోదరుడు బీమ్ చోప్రా తెలిపారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com

## మాలేపూర్ ఘాట్ రోడ్డు వద్ద ప్రమాదంపై పోలీసుల విచారణ

**డ్రైవర్ నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణమన్న ఉట్నూర్ ఏఎస్పీ కాజల్**

**లైసెన్స్ లేకుండా వాహనం నడిపిన డ్రైవర్.. కేసు నమోదు, కొనసాగుతున్న విచారణ**

**ఆదిలాబాద్, మహా :** శనివారం నార్నూర్ మండలం మాలేపూర్ ఘాట్ రోడ్డు వద్ద ఐచర్ వాహనం బోల్తాపడిన ఘటన పై పోలీసుల విచారణ కొన సాగుతోంది. గుడిహత్నూరు మండలం సూర్యగూడకు చెందిన ఆదివాసీలు దైవ దర్శనానికి వెళ్లివస్తూ నార్నూర్ మండలం మాలేపూర్ ఘాట్ రోడ్డు వద్ద వారు ప్రయాణిస్తున్న ఐచర్ వాహనం బోల్తపడిన ఘటనలో ఇప్పటివరకు ఇద్దరు కుమ్ర మాల్కు , తుడసం నాగుబాయ్ మృతి చెందగా దాదాపు 37 మంది గాయ పడ్డట్టు తెలిపారు.. ప్రమాదానికి ఐచర్ డ్రైవర్ కనక శ్రీరామ్ ( 26 ) నిర్లక్ష్యం కారణమని పోలీసులు నిర్ధారించారు. గుడిహత్నూర్ మండలం పూనగూడ తోషం గ్రామానికి చెందిన డ్రైవర్ డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాన్ని నిర్లక్ష్యంగా నడిపి ప్రమాదానికి కారణమయ్యాడని ఉట్నూర్ ఎఎస్పి కాజల్ ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ పై నార్నర్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్టు తెలిపారు.

## ఇచ్చోడ మండలంలో అక్రమ వెంచర్

**అడేగామ (బీ) శివారులో "రియల్" మోసం.. అమ్మకాల జాతర.. నిబంధనలకు పాతర**



**ఆదిలాబాద్ మహా :** రియల్ ఎస్టేట్ వ్యాపారం అంటేనే మోసం, దగా అన్నట్టు తయారైందన్న విమర్శలున్నాయి.అక్రమ వెంచర్ లో ప్లాట్లు కొనుగోలు చేసి నిండా మునిగి పోతున్నారు అమాయకులు . అది అక్రమ లేఅవుట్ అని రియల్టర్లకు , మధ్య దళారులకు తెలుసు. కానీ కొనుగోలుదారులకు తెలియదు. పై పై మెరుగులు అద్ది తమది అనుమతి తో కూడిన వెంచర్ అని ప్రకటనలిస్తూ నిండా ముంచేస్తున్నారు. భయం లేని కోడి బజార్ లో గుడ్డు పెట్టిందన్నట్టు ఇచ్చోడలోని జాతీయ రహదారి 44 కు సమీపంలోని అడేగామ (బీ) శివారులో నిబంధనలకు విరుద్ధంగా అక్రమ వెంచర్ వెలిసింది. వ్యవసాయ భూమిని కొనుగులు చేసి, నాలా కన్వర్షన్ అనుమతి తీసుకున్నారు. మిగతా అనుమతులకు మంగళం పాడి తుంగలో తొక్కారు. వ్యవసాయ భూమిని కొనుగోలు చేసి ప్లాట్లుగా మార్చి అనుమతులు పొందకుండా ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు.

**అనుమతులు లేకుండానే...**

నాలా (నాన్ అగ్రికల్చరల్ లాండ్స్ అసెస్మెంట్ యాక్ట్) చట్టం2006 ప్రకారం నాలా చట్టాన్ని అనుసరించి వ్యవసాయ భూములను వ్యవసాయేతర పనులకు ఉపయోగిస్తే ఏక మొత్తంలో ఒకేసారి కన్వర్షన్ చార్జీల ను భూమి విలువపై 3 శాతం ప్రభుత్వానికి చెల్లిం చాల్సి ఉంటుంది.కన్వర్షన్ అనంతరం భూమిని ప్లాట్లుగా మార్చి విక్రయించాలంటే డీటీసీపీ(డైరెక్టరేట్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్) అనుమతి తప్పనిసరి. ఎకరం (40 గుంటలు) స్థలంలో డీటీసీపీ అనుమతికి వెళ్తే 12 శాతం ఓపెన్ స్థలం (9 శాతం గ్రీనరీ, 1 శాతం వాటర్ ట్యాంక్, సెప్టిక్ ట్యాంకులు, 1 శాతం వాణిజ్య అవసరాలు, 1 శాతం హెల్త్ సెంటర్, పాఠశాల) కోసం స్థలం కేటాయించాల్సి ఉంటుంది. నిర్ధేశించిన వెడల్పుతో రోడ్లకు స్థలం పోగా ఎకరానికి 24 గుంటలు మాత్రమే ప్లాట్ల స్థలం మిగులుతుంది. అంతర్గత రోడ్లు 30 ఫీట్ల వెడల్పు, మేయిన్ రోడ్లు, అప్రోచ్ రోడ్లు కనీసం 40 ఫీట్ల వెడల్పుతో ఉండాలనే నిబంధనలు ఉన్నాయి. డీటీసీపీ అనుమతి కోసం బెటర్మెంట్, డెవలప్ మెంట్ చార్జీల పేరిట భూమి విలువకు అనుగుణంగా ప్రభుత్వానికి ఫీజులు చెల్లించాలి. రెండున్నర ఎకరాల వరకు జిల్లా టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ ఆఫీసర్ నుంచి లేఅవుట్ అనుమతి పొందాల్సి ఉన్నప్పటికీ అటువంటి నిబంధనలు ఇక్కడ ఏమీ కనిపించడం లేదు.

**వసతులు కాగితం పైనే**

డీటీసీపీ లే అవుట్ వెంచర్లలో అన్ని రకాల వసతులైన 33 ఫీట్ల రోడ్డు, బీటీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, ప్రహరీ, వాటర్ పైప్‌లైన్, సంప్, ఎలక్ట్రిసిటీ, వీధి లైట్లు, ఓపెన్ జిమ్, వాలీబాల్, షటిల్ కోర్టులు, పార్కు, చిల్డ్రన్స్ ప్లే ఏరియా, రోడ్డుకు ఇరువైపుల చెట్లు, స్పాట్ రిజిస్ట్రేషన్ వంటి సౌకర్యాలు వెంచర్లలో కల్పించాలి. ఇలాంటి సౌకర్యాలు వెంచర్‌లలో ఉంటేనే ప్లాట్లు విక్రయించాలి. ప్రస్తుతం అడేగామ బీ శివారం లో వెలిసిన ఈ వెంచర్‌లో ఎక్కడ పై నిబంధనలు అమలు కావడం లేదు. 20 ఫిట్లు రోడ్లు వేసి, ఫేక్ పత్రాలు చూపుతూ ప్లాట్లను అమాయకులకు అంట గడుతూ రియల్టర్లు మోసాలు చేస్తూ చేతులు దులుపుకుంటున్నారు.

## నేటి నుండి 24 వరకు గ్రామ సభల నిర్వహణ

### గ్రామ సభలకు విస్తృత ఏర్పాట్లు

- 21 నుండి నిర్వహించే గ్రామ సభల్లోనూ దరఖాస్తు తీసుకుంటాం
- లబ్ధిదారుల ఎంపిక అనేది నిరంతర ప్రక్రియ
- అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు
- గ్రామ సభలకు జిల్లా ప్రజలు సహకరించాలి.. జిల్లా కలెక్టర్ దివాకర టి. ఎస్



**ములుగు, మహా :** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమపథకాలకు లబ్ధిదారుల ఎంపికలో భాగంగా చేపట్టిన సర్వే అనంతరం జనవరి 21 నుండి 24 వరకు గ్రామ సభల నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలియజేశారు. ఈ మేరకు కలెక్టర్ దివాకర టీఎస్ సోమవారం ప్రకటన విడుదల చేశారు. గ్రామ సభల నిర్వహణకోసం విస్తృతంగా ఏర్పాట్లు చేయడం జరిగిందని, సర్వే ముగిసిందని ప్రజలు భయాందోళనకు గురికావాల్సిన అవసరం లేదని, గ్రామసభల్లోనూ దరఖాస్తు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. లబ్ధిదారుల ఎంపిక అనేది నిరంతర ప్రక్రియ అని, జిల్లా ప్రజలు సహకరించాలని కలెక్టర్ కోరారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇల్లు వస్తాయని, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు చేరేలా పటిష్ట కార్యాచరణ అమలు చేస్తున్నట్లు తెలిపారు. అందుకు గాను ఈ నెల 16 నుండి 20 వరకు క్షేత్ర స్థాయి దరఖాస్తులు పరిశీలన చేయడం జరిగిందని, 21 నుండి 24 వరకు గ్రామ సభలు నిర్వహించడం జరుగుతుందనీ జిల్లా ప్రజలు సహకరించాలని జిల్లా తెలిపారు.

**గణతంత్ర దినోత్సవం నుండి పథకాల అమలు**

రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల జారీ ప్రక్రియ ప్రభుత్వం గణతంత్ర దినోత్సవం నుంచి రంభించనుందని, వ్యవసాయ యోగ్యమైన ప్రతి ఎకరాకు రైతు భరోసా పంట వేసినా, వేయక పోయినా అందుతుందని, రైతులు అనవసర అపోహలు పెట్టుకోవద్దని, రైతు భరోసా పథకానికి ఎటువంటి పరిమితులు లేవని, వ్యవసాయ యోగ్యమైన ప్రతి ఎకరాకు 12 వేలు పెట్టుబడి సహాయం ప్రభుత్వం అందిస్తుందని కలెక్టర్ తెలిపారు. భూమిలేని వ్యవసాయ కూలీల కుటుంబాలకు ఏడాదికి 12 వేలు రూపాయలను అందించడం జరుగుతుందని, ఒక్కో విడతకు 6 వేల చొప్పున రెండు విడతలుగా అందించేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని ప్రారంభించనుందని, 2023 - 24 సంవత్సరానికి ఉపాధి హామీ పథకంలో పని చేసిన భూమి లేని రైతు కుటుంబాలకు ఈ పథకం వర్తిస్తుందని అన్నారు. జిల్లాలో 20 రోజులు ఉపాధి హామీ కూలీలు గా పని చేసిన కార్మికుల జాబితాను తీసుకొని ఆధార్ కార్డు ట్యాగ్ ప్రకారం పరిశీలిస్తూ భూమిలేని కుటుంబాలను ఎంపిక చేయడం జరుగుతుందని, ఇందిరమ్మ ఇండ్ల సర్వే ద్వారా సొంత భూమి ఉండి ఇండ్లు లేని కుటుంబాల జాబితాను సిద్ధం చేశామని, గ్రామ సభలో అభ్యంతరాలను స్వీకరించడం జరుగుతుందని, గ్రామ సభలో అర్హుల జాబితా గ్రామాల వారీగా సిద్ధం చేసిన తర్వాత నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. గ్రామ సభల్లో ఇచ్చిన దరఖాస్తులను కూడా పరిగణలోకి తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. కుటుంబంతో విభజన అయినవారు కొత్త కార్డు కావాలని తీసుకున్న దరఖాస్తును కూడా పరిశీలిస్తామన్నారు. గతంలో పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను కూడా పరిశీలిస్తామని తెలిపారు. ఇదివరకు ఎప్పుడూ దరఖాస్తు సమర్పించకపోయినా గ్రామాల్లోకి వచ్చే అధికారులకు దరఖాస్తులు ఇవ్వాలని సూచించారు. ఇందిరమ్మ ఇల్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డుల ప్రభుత్వ సంక్షేమ పథకాల పై సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శులను, ఎం పి డి ఓ లను సంప్రదించి సందేహాలను నివృత్తి చేసుకోవాలని, లేదా కలెక్టరేట్ లోని కంట్రోల్ రూమ్ నెంబర్ 1800 425 7109 ను సంప్రదించాలని కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు.

## నూతన వ్యాపారాన్ని ప్రారంభించిన కూడా చైర్మన్




**హనుమకొండ, మహా:** హన్మకొండ చౌరస్తాలో నూతనంగా పి.ప్రేమ్ కుమార్ ఏర్పాటు చేసిన ఫ్రూట్ బే వ్యాపారాన్ని కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామి రెడ్డి, వరంగల్ పశ్చిమ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అల్లుడు విష్ణువర్ధన్ రెడ్డి సంయుక్తంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె రాహుల్ రెడ్డి, యువజన కాంగ్రెస్ జిల్లా మాజీ అధ్యక్షులు రేపల్లె రంగనాథ్, ఆర్టీఏ అఫిషియల్ మెంబర్ పల్లకొండ సతీష్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా వినతులను త్వరగా పరిష్కరించండి

**జీడబ్ల్యూఎంసీ కమిషనర్ డా.అశ్విని తానాజీ వాకడే**



**వరంగల్, మహా:** ప్రజావాణి (గ్రీవెన్స్) లో స్వీకరించిన ప్రజా వినతులను త్వరితగతిన పరిష్కరించాలని బల్దియా కమీషనర్ డా.అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని పురస్కరించుకొని బల్దియా ప్రధాన కార్యాలయం లోని కౌన్సిల్ హాల్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమం లో కమీషనర్ పాల్గొని ప్రజల నుండి విజ్ఞప్తులు స్వీకరించి పరిష్కార నిమిత్తం ఆయా విభాగాల ఉన్నతాధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా స్వీకరించిన ఫిర్యాదుల వివరాలు విభాగాల వారిగా 1.ఇంజనీరింగ్....23 2.హెల్త్& సానిటేషన్.........07 3.ప్రాపర్టీ టాక్స్(రెవెన్యూ)...11 4.టౌన్ ప్లానింగ్....30 5.మంచినీటి 6.సరఫరా.......... 02 జనరల్ .......... 04 మొత్తం = 77 గా అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఈ ప్రవీణ్ చంద్ర, సిఎం హెచ్ ఓ.. డా. రాజిరెడ్డి, సిహెచ్ ఓ.. రమేష్ బయలజిస్ట్.. మాధవ రెడ్డి, ఇన్చార్జి సిపి రవీంద్ర.. డిప్యూటీ కమిషనర్.. ప్రసన్న రాణి, తదితరులు పాల్గొన్నారు .

## ఇంటింటి సర్వేను పారదర్శకంగా నిర్వహించాలి

**వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా**



**వరంగల్, మహా:** రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్ల కోసం నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా అధికారులను ఆదేశించారు. సోమవారం వరంగల్ జిల్లా జిడబ్ల్యూఎంసీ పరిధిలోని 16వ డివిజన్ జాన్ పాక ప్రాంతంలో రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల జారీ కోసం నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం సర్వే కోసం నియమించిన బృందంతో కలెక్టర్ మాట్లాడుతూ సర్వే లో తప్పులు లేకుండా, పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. అర్హులైన వారు ఎవరు కూడా మిస్ కాకుండా చూడాలని, రిమార్కులు సరిగా రాయాలని అన్నారు. మిస్ అయిన వారు గ్రామసభల్లో దరకాస్తూ చేసుకోవచ్చని కలెక్టర్ స్పష్టం చేశారు. అర్హులందరికీ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని కలెక్టర్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 21 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించే వార్డు, గ్రామసభలకు వచ్చే ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా విస్తృత ఏర్పాట్లు చేయాలని సూచించారు. గతంలో నిర్వహించిన ప్రజపాలన గ్రామసభల మాదిరిగానే నిర్వహించాలని, రోజు ఒక వార్డు లో మాత్రమే వార్డు సభలు నిర్వహించాలని పేర్కొన్నారు.

**అనంతరం..**

రాయపర్తి మండలం గన్నారం, వర్ధన్నపేట మండలం రామోజీ తండాలో జరుగుతున్న సర్వే తీరును జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సోమవారం పరిశీలించారు. సర్వేలో ఎదురవుతున్న సమస్యలను సర్వే టీం లతో మాట్లాడి కలెక్టర్ తెలుసుకున్నారు. ఈ సందర్భంగా భూక్య మల్లు అనే రైతు కలెక్టర్ తో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రజలకు ఉపయోగపడే విధంగా ఉన్నాయని ఆనందం వ్యక్తం చేస్తూ, ఈ తండాలో అంగన్వాడి సెంటర్ ను ఏర్పాటు చేయాలని, రోడ్డు కూడా అవసరం ఉందని, వివిధ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్ళారు. అందుకు కలెక్టర్ స్పందిస్తూ.. గ్రామసభల్లో సమస్యలపై వినతులు స్వీకరిస్తారని, ఏ సమస్యలున్నా వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించుటకు కృషి చేస్తానని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పి సీఈఓ రామిరెడ్డి, ఆర్డీఓ సత్యపాల్ రెడ్డి, ఉప కమిషనర్ కృష్ణా రెడ్డి, రెవెన్యూ అధికారి శ్రీనివాస్, సివిల్ సప్లయ్ డీఎం సంధ్యారాణి, వర్దన్నపేట తహసిల్దార్ విజయ్ సాగర్, రాయపర్తి తహసీల్దార్ శ్రీనివాస్, ప్రత్యేక అధికారి ఫిషరీస్ నాగమణి, జీడబ్ల్యూఎంసీ సిబ్బంది తోపాటు సర్వే టీం సభ్యులు పాల్గొన్నారు.

## ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాన్ని పరామర్శించిన కంది శ్రీనివాస రెడ్డి, ఆడె గజేందర్



**ఆదిలాబాద్ మహా :** ఇటీవల ఆదిలాబాద్ పట్టణంలోని ఐసీఐసీఐ బ్యాంకు ఆవరణలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న బేల మండలం రేణిగూడ కు చెందిన రైతు జాదవ్ దేవరావ్ కుటుంబాన్ని సోమవారం ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి , బోథ్ అసెంబ్లీ ఇంచార్జి ఆడె గజేందర్ పరామర్శించారు. రేణిగూడ లోని వారి నివాసానికి వెళ్లి జిల్లా ఇంచార్జి మంత్రి సీతక్క తరపున రైతు కుటుంబానికి 25వేల రూపాయల ఆర్థిక సాయాన్ని అందించారు. ఇంటి పెద్ద దిక్కును కోల్పోవడంతో కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అనంతరం రైతు కుటుంబ సభ్యులతో కంది శ్రీనివాస రెడ్డి మంత్రి సీతక్క తో ఫోన్ లో మాట్లాడించారు. ఆమె కుటుంబ సభ్యులను ఓదార్చారు. వారికి ధైర్యం చెప్పారు. ప్రభుత్వం తరపున అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

## సంక్షేమ పథకాలు నాలుగు..సందేహాలు సవాలక్ష?

**జనవరి 26 నుంచి ప్రభుత్వ పథకాల అమలు.. తప్పల తడకగా లబ్ధిదారుల జాబితా**

**విధి విధానాలపై అధికారులకు స్పష్టత కరువు**



**వరంగల్, మహా:** గత టిఆర్ఎస్ ప్రభుత్వంలో కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియను పూర్తి చేయకుండా పాలకులు ఊరిస్తూ పది సంవత్సరాలు గడిపారు. అంతేకాకుండా సకల జనుల సర్వే చేసిన తర్వాత అందులోనుండి అనర్హులైన వారిని తొలగిస్తామని ఏవేవో ఊహాగానాలు వినిపించాయి అంతేకాకుండా అర్హులైన లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులు మంజూరు చేస్తామనే ఊహగానాలతో వేలాది మంది అర్హులకు ఎదురు చూపులు తప్పలేదు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు స్వీకరించింది. గత ప్రభుత్వం మాదిరిగానే రెండు నెలల క్రితం కుల గణన సర్వేలో కూడా రేషన్ కార్డులు లేని కుటుంబాల వివరాలు సేకరించారు. ప్రభుత్వం ప్రస్తుతం చేస్తున్న సర్వేలో కొంత మంది అర్హుల పేర్లు కనిపించక పోవడంతో అర్హులైన వారిలో మరల ఆందోళన నెలకొంది. అదే విధంగా గతంలో ఉన్న రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పులు చేసుకునేందుకు పాటించాల్సిన నిబంధనలపై కూడా అధికారుల్లో స్పష్టత లేదని ప్రజలు అంటున్నారు. గతంలో మీ సేవ కేంద్రాల్లో అప్లై చేసుకున్న వారి దరఖాస్తుల విషయంలో ఎటువంటి నిర్ణయం తీసుకుంటారనే విషయంలో కూడా అధికారులు ఎటువంటి స్పష్టత ఇవ్వలేకపోతున్నారు. గతంలో రేషన్ కార్డు దరఖాస్తుల పరిశీలన స్థానిక తహసీల్దార్ ఆధ్వర్యంలో నిర్వహించగా తాజాగా కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియ ఎంపీడీఓ ఆధ్వర్యంలో జరుగుతోంది. దీంతో మీసేవ కేంద్రాల ద్వారా గతంలో వచ్చిన దరఖాస్తులు ఎవరు పరిశీలిస్తారనే విషయంలో సందిగ్ధత నెలకొంది.

**ఆత్మీయ భరోసాపై ఆందోళన..**

కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొత్తలో భూమి లేని నిరుపేదలకు సంవత్సరానికి రూ.12. వేలు ఇస్తామని హామి ఇచ్చి తాజాగా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అనే పేరుతో ఉపాధి హామి పథకంలో జాబ్ కార్డుల ఆధారంగా భూమి లేని కుటుంబాలకు చేయూత అభయహస్తం వివరాలు సేకరించింది. ఈ వివరాల్లో కూడా అనేక తప్పులు దొర్లాయని తెలుస్తోంది. తొలుత భూమి లేని ఉపాధి కూలీలకు సాయం అని చెప్పి తాజాగా కుటుంబాన్ని ప్రామాణికంగా తీసుకోవడంతో కుటుంబంలో ఒకరి పేరున భూమి ఉన్న కుటుంబం మొత్తం ఈ పథకానికి అర్హత కోల్పోయే ప్రమాదం ఉంది. ఉమ్మడి కుటుంబంలో నుండి కొత్తగా పెళ్లైన వారు ఉపాధి హామి జాబ్ కార్డులో వారి తల్లిదండ్రులతో కలిసి పేరు ఉండటం వలన కూడా చాలా మంది ఈ పథకానికి అనర్హులు గా మిగిలారు. ప్రస్తుతం ప్రభుత్వం గుర్తించిన లబ్ధిదారులలో ఏళ్ల క్రితం చనిపోయిన వారి పేర్లు కూడా ఉండటం గమనార్హం.

**ఇందిరమ్మ ఇండ్లపై స్పష్టత కరువు..**

గత టిఆర్ఎస్ ప్రభుత్వంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పేరుతో కాలం గడిపారు. కనీసంగతంలో నిర్మించిన డబల్ బెడ్ రూమ్ ఇండ్లను కూడా నిరుపేదలకు పంచిన దాఖలా లేదు. నిర్మించిన ఇండ్లు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. లబ్ధిదారులు డబల్ బెడ్ రూమ్ ఇండ్ల కోసం పదేపదే మీసేవ సెంటర్ల చుట్టూ తిరిగి దరఖాస్తులు చేసుకున్న వారికి డబుల్ బెడ్ రూమ్ఇండ్లు పంపిణీ చేస్తామని గత పాలకుల మాటలతోనే లబ్ధిదారుల ఆశలు అడుగంటాయి. ప్రస్తుతం ఉన్న ప్రజా ప్రభుత్వం మరో ముఖ్యమైన హామి అయిన ఇందిరమ్మ ఇళ్లు కూడా ఏ ప్రాతిపదిక ఎంపిక చేస్తారనే విషయంలో సందిగ్ధత నెలకొంది. తొలి విడతలో నియోజక వర్గానికి 3,500 ఇళ్లు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించగా గతంలో 2007లో ఇందిరమ్మ ఇల్లు పొందిన వారిని పరిగణనలోకి తీసుకుంటారా లేదా కొత్త వారికి అవకాశం ఇస్తారా అనే దానిపై స్పష్టత లేదు. మహిళలకు రేషన్ కార్డు, ప్రజా పాలన దరఖాస్తులు, కుల గణన సర్వే వీటిలో ఇందిరమ్మ ఇండ్ల ఎంపికకు దేనిని ప్రామాణికంగా తీసుకుంటారో తెలియడం లేదు.

**గడువులోగా అయ్యేనా..**

గత ప్రభుత్వం రైతు బంధు పేరుతో ఎకరాకు సంవత్సరానికి రూ.10వేలు అందజేయగా కాంగ్రెస్ప్రభుత్వం రైతు భరోసా పేరుతో ఎకరానికి రూ.12 వేలు ఇవ్వాలని నిర్ణయించారు. ఈ మేరకు వ్యవసాయ శాఖ అధికారులు, రెవెన్యూ అధికారులు సాగు భూముల వివరాలు గ్రామాల వారీగా సర్వే చేస్తూ ఆప్లో నమోదు చేస్తున్నారు. ఈ సర్వేలోను అధికారులు పట్టాదారు పాస్ బుక్కుల వారీగా సర్వే చేస్తున్నారా లేదా సర్వే నెంబర్ ల వారీగా సర్వే చేస్తున్నారా అనే విషయంలో స్పష్టత లేదు. ఒక్కో క్లస్టర్ పరిధిలో, వందల సంఖ్యలో సర్వే నెంబరు లు ఉండటంతో గడువులోగా సర్వే పూర్తి అవుతుందో లేదో తెలియడం లేదు. అధికారుల సర్వే లో ఏ ఒక్క సర్వే నెంబరు నమోదు కాకపోయినా వందల సంఖ్యలో రైతులు రైతు భరోసా కోల్పోయే పరిస్థితి నెలకొందని రైతులు ఆందోళన కు చెందుతున్నారు.

## ఉత్సాహంగా మహిళా కార్పొరేటర్ల క్రీడా పోటీలు

**ప్రారంభించిన నగర మేయర్, కమిషనర్**



**వరంగల్, మహా;** గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని బల్దియాకు చెందిన మహిళా కార్పొరేటర్ లకు ఏర్పాటు చేసిన క్రీడా పోటీలను గ్రేటర్ వరంగల్ మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ డా.అశ్విని తానాజీ వాకడే సోమవారం ఇండోర్ స్టేడియం లో సంయుక్తం గా ప్రారంభించి పాల్గొన్నారు. ఈ సందర్భం గా మేయర్ మాట్లాడుతూ గౌ. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్రీడలను ప్రోత్సహించడానికి ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ క్రీడా పాలసీ రూపొందించడానికి చర్యలు చేపడుతున్నారని ఇటీవల రాష్ట్ర వ్యాప్తం గా సి ఎం కప్ పేరుతో గ్రామీణ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు వివిధ క్రీడాంశాల్లో పోటీలను నిర్వహించారని ప్రతి సం.గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని బల్దియా తరపున మహిళా కార్పొరేటర్లకు బ్యాడ్మింటన్ చేస్ క్యారమ్స్ టగ్ ఆఫ్ వార్ కబడ్డీ మ్యూజికల్ చైర్ తదితర క్రీడాంశాలలో పోటీల తో పాటు పురుష కార్పొరేటర్ లకు క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నామని అంతే కాకుండా బల్దియా కు చెందిన మహిళా ఉద్యోగులు సిబ్బంది తో పాటు మీడియా ప్రతినిధులు కాంట్రాక్టర్లు లకు కూడా క్రికెట్ పోటీల్లో పాల్గొనేలా పోటీలు నిర్వహిస్తున్నామని జీడబ్ల్యూఎంసి తరపున అందరినీ కలుపుకొని క్రీడా పోటీల్లో భాగస్వాములను చేస్తూ ఒక ఫ్యామిలీ గా క్రీడా స్ఫూర్తినీ చాటేలా పోటీలు నిర్వహిస్తున్నామని మేయర్ అన్నారు. ఈ సందర్భం గా మహిళా కార్పొరేటర్ లు కమిషనర్ మేయర్ లు బ్యాడ్మింటన్ మ్యూజికల్ చైర్ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ క్రీడల తో పాటు రెండు జట్లుగా ఏర్పడిన మహిళా కార్పొరేటర్లు టగ్ ఆఫ్ వార్ కబడ్డీ పోటీలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు అరుణ కుమారి జన్ను శిభారాణి పల్లం పద్మ గుండు చందన గుజ్జుల వసంత రాధికా రెడ్డి శిరీష రమా తేజస్వి విజయ శ్రీ రజాలి జక్కుల రజిత దివ్యరాణి జలగం అనిత మనసా రాంప్రసాద్ ఇమ్మడి లోహిత తో పాటు డి ఎఫ్ ఓ శంకర్ లింగం, టి పి ఓలు రజత, రోజారెడ్డి, సుమన, తదితరులు పాల్గొన్నారు.